

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 18-05-2026 | సంపుటి - 27 | సంచిక -356 | రూ : 4 | పేజీలు: 8




## సీబీఎస్ఈ 12వ క్లాస్ పేపర్ల మూల్యాంకనంలో AI వాడకంపై స్పష్టత

- 'ఆన్‌స్క్రీన్ మార్కింగ్' విధానంపై తీవ్ర విమర్శలు
- ఏఐ వాడలేదని బోర్డు వివరణ
- జవాబు పత్రాలను మాత్రమే డిజిటలైజ్ చేశామని వెల్లడి
- మే 19 నుంచి ప్రత్యేక సమీక్ష

2లో

## నెదర్లాండ్స్, స్వీడన్‌లతో వ్యూహాత్మక బంధం

- రక్షణ, విలువైన ఖనిజాలవంటి రంగాలపై ఒప్పందాలు
- భారత ప్రధాని సమక్షంలో సంతకాలు




ది హేగ్ (నెదర్లాండ్స్), గోథెన్‌బర్గ్ (స్వీడన్): ప్రపంచ భౌగోళిక రాజకీయాలు మారిపోతున్న తరుణంలో నెదర్లాండ్స్, స్వీడన్‌లతో తమ భాగస్వామ్య బంధాన్ని వ్యూహాత్మక స్థాయికి తీసుకువెళ్లాలని భారత్ నిర్ణయించింది. రక్షణ, విలువైన ఖనిజాలు, ఇతర కీలక రంగాల్లో నెదర్లాండ్స్‌తో 17 ఒప్పందాలపై ఇరు దేశాలూ సంతకాలు చేశాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెటెన్‌ల సమక్షంలో ఇవి కుదిరాయి. ఐరోపా పర్యటనలో భాగంగా శనివారం రాత్రి జెటెన్‌తో మోదీ భేటీ అయినప్పుడు ఇరువురు నేతలూ పశ్చిమాసియాలో పరిస్థితులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రపంచ ఇంధన రంగానికి ఎదురవుతున్న అవాంతరాలు, వాణిజ్య వ్యవస్థలు దెబ్బతినడం వంటివాటిపై సమాలోచనలు

తరువాయి 2లో

## యూట్యూబ్ ఛానల్ ప్రారంభించిన నారా దేవాన్ష్..

- 'Dino Deets' పేరుతో పాడ్‌కాస్ట్‌లు
- డైనోసార్లు, శిలాజాల గురించి ఆసక్తికర విషయాలు
- నారా కుటుంబ సభ్యుల అభినందనలు
- శుక్రవారం తొలి ఎపిసోడ్




2లో


## 3 గంటల్లో హైదరాబాద్ - ముంబయి

- మూడు రాష్ట్రాల్లో హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టు
- తెలంగాణలో 93 కిమీ.. కోకాపేట, వికారాబాద్‌లలో రైల్వేస్టేషన్లు
- మహారాష్ట్ర పరిధిలో 3 ప్రాంతాల్లో 35 కిమీ మేర భూగర్భ మార్గం
- స్టేషన్లు 12.. వేగం 300 కిమీ.. దూరం 671 కిమీ



2లో

## ఎబోలాపై ఆరోగ్య అత్యవసర స్థితి




- ప్రకటించిన డబ్ల్యూహెచ్‌వో

అబుజా: ఆఫ్రికా ఖండంలోని కాంగోలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ఇప్పటికే ఈ ప్రాణాంతక వ్యాధి సోకి 88 మంది మృతి చెందారు. మరో 300 మందికిపైగా ప్రజలు ఈ వైరస్ బారిన పడినట్లు అధికారులు తెలిపారు. పొరుగునున్న ఉగాండాలోనూ

తరువాయి 2లో

## శాంతి చర్చలు.. ఇరాన్ ముందు అమెరికా ఐదు కఠిన షరతులు



- యుద్ధ నష్టపరిహారం ఇవ్వబోమని స్పష్టం
- 400కిలోల యురేనియం ఇవ్వాలని డిమాండ్
- స్తంభించిన నిధుల విడుదలకు నిరాకరణ
- ఇరాన్ సైతం ఐదు షరతులు

2లో

## ఆ ఒప్పందం జరిగితేనే భారత్‌తో బంధం..

బంగ్లాదేశ్ కొత్త మెలిక!


2లో



## నీట్ పేపర్ లీక్ కేసు..

ఎవరీ మనీషా గురునాథ్? ఆమె పాత్రేంటి?

- నీట్ లీక్ కేసులో ప్రొఫెసర్ మనీషా అరెస్ట్
- ఎన్‌టీఏ నిపుణురాలిగా ఉండటంతో చేతికి ప్రశ్నపత్రాలు
- నిందితురాలి ఇంట్లోనే రహస్యంగా క్లాసులు
- ఈ కేసులో ఇప్పటివరకు తొమ్మిది మంది అరెస్ట్



2లో

## ఏడు నిమిషాల్లో పనిచేసే క్యాన్సర్ ఇంజెక్షన్



- ఒక్క డోస్ ధర రూ.3.7 లక్షలు
- ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులకు ఉపయోగం
- క్యాన్సర్ కణాలను గుర్తించి నయం
- ప్రభుత్వ పథకాల ద్వారా రీయింబర్స్‌మెంట్

ఢిల్లీ: భారతదేశంలో క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక ముందడుగు పడింది. ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగుల కోసం కేవలం ఏడు నిమిషాల్లో పనిచేసే సరికొత్త ఇంజెక్షన్ అందుబాటులోకి వచ్చింది. రోచ్ ఫార్మా ఇండియా సంస్థ 'టెసెంట్రిక్' పేరుతో

తరువాయి 2లో

## ఇంజినీరింగ్ 73.36 శాతం

- అగ్రికల్చర్ ఫార్మసీలో 86.27 శాతం
- అర్ధ్వతవారం రోజుల్లో కౌన్సెలింగ్ షెడ్యూల్
- ఇంజినీరింగ్ మొదటి ర్యాంకర్ అమ్మాయి
- అగ్రికల్చర్, ఫార్మసీలో టాపర్ అబ్బాయి
- ఎప్ సెట్-2026 ఫలితాలను విడుదల చేసిన ప్రభుత్వ సలహాదారు కేశవ రావు

2లో



# నెదర్లాండ్స్, స్వీడన్‌లతో వ్యూహాత్మక బంధం

ది హేగ్ (నెదర్లాండ్స్), గోథెన్‌బర్గ్ (స్వీడన్): ప్రపంచ భౌగోళిక రాజకీయాలు మారిపోతున్న తరుణంలో నెదర్లాండ్స్, స్వీడన్‌లతో తమ భాగస్వామ్య బంధాన్ని వ్యూహాత్మక స్థాయికి తీసుకువెళ్లాలని భారత్ నిర్ణయించింది. రక్షణ, విలువైన ఖనిజాలు, ఇతర కీలక రంగాల్లో నెదర్లాండ్స్‌తో 17 ఒప్పందాలపై ఇరు దేశాలూ సంతకాలు చేశాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెటెన్‌ల సమక్షంలో ఇవి కుదిరాయి. ఐరోపా పర్యటనలో భాగంగా శనివారం రాత్రి జెటెన్‌తో మోదీ భేటీ అయినప్పుడు ఇరువురు నేతలూ పశ్చిమాసియాలో పరిస్థితులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రపంచ ఇంధన రంగానికి ఎదురవుతున్న అవాంతరాలు, వాణిజ్య వ్యవస్థలు దెబ్బతినడం వంటివాటిపై సమాలోచనలు జరిపారు. హర్మూజ్ జలసంధి మీదుగా నౌకాయానానికి అడ్డంకులవల్ల ఉత్పన్నమైన పరిస్థితిపై కలవరం వ్యక్తం చేశారు. నౌకాయాన స్వేచ్ఛ ఉండాలని, ఎలాంటి నియంత్రణలు ఉండకూడదని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ దిశగా జరుగుతున్న ప్రయత్నాలకు పూర్తి మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ చట్టాలకు తగ్గట్టు ఉక్రెయిన్‌లో శాంతిస్థాపన జరగాలని ఆకాంక్షించారు.

**ఇరు దేశాల బంధాలకు కొత్త ఊపు**

మోదీ సామాజిక మాధ్యమాల్లో స్పందిస్తూ.. తన పర్యటనతో భారత్, నెదర్లాండ్స్ మధ్య సంబంధాలకు కొత్త ఊపు లభించినట్లయిందన్నారు. ఉద్యోగం, విద్య కోసం భారతీయులు నెదర్లాండ్స్‌కు వచ్చేందుకు వీలు కల్పించే ఒప్పందం కూడా కుదిరింది. మోదీ, జెటెన్ కలిసి చరిత్రాత్మక అఫ్‌స్లుట్డిక్ జలాశయంలో కాసేపు విహరించారు. భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ క్షీణిస్తోందని, మైనారిటీల హక్కులు హరించుకుపోతున్నాయని డచ్ ప్రధాని రాబ్ జెటెన్ చేసినట్లు వచ్చిన ఆరోపణలను భారత్ తోసిపుచ్చింది.

**స్వీడన్ పురస్కారం స్వీకరణ**

ఐరోపాలో 4 రోజుల పర్యటనలో భాగంగా నెదర్లాండ్స్ నుంచి మోదీ స్వీడన్‌కు చేరుకున్నారు. వాణిజ్యం, సాంకేతికత, రక్షణరంగం తదితరాలపై ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్‌సన్‌తో చర్చలు జరిపారు. మోదీ దార్శనిక నాయకత్వాన్ని, ఇరు దేశాల సంబంధాల్లో అసాధారణ కృషిని గుర్తిస్తూ ప్రతిష్ఠాత్మక 'రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్, డిగ్రీ కమాండర్ గ్రాండ్ క్రాస్' పురస్కారాన్ని స్వీడన్ అందజేసింది. యువరాణి విక్టోరియా నుంచి ఆయన దీనిని అందుకున్నారు. ఇంతవరకు ఇలాంటి 31 పురస్కారాలను ఆయన విదేశాల్లో స్వీకరించారు. మర్స్క్ ఛైర్మన్ రాబర్ట్ మర్స్క్ ఉగ్లాతో మోదీ సమావేశమై భారత్‌లో ఓడరేవుల్లో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. మోదీ ప్రయాణిస్తున్న విమానానికి తోడుగా స్వీడన్ వాయుసేన విమానాలు వచ్చాయి. విమానాశ్రయానికి క్రిస్టర్‌సన్ వచ్చి స్వాగతించారు.

## ఆ ఒప్పందం జరిగితేనే భారత్‌తో బంధం.. బంగ్లాదేశ్ కొత్త మెలిక!

- **గంగా నది ఒప్పందంపైనే ఇరుదేశాల బంధమన్న బంగ్లా**
- **డిసెంబర్‌లో ముగియనున్న పాత ఒప్పందం గడువు**
- **పద్మా నదిపై బంగ్లాదేశ్ మెగా ప్రాజెక్టు**
- **తీస్తా వివాదంపై మమతా బెనర్జీపై విమర్శలు**

భారత్‌తో సంబంధాలు కొనసాగడం గంగా నది నీటి పంపకాల ఒప్పందంపైనే ఆధారపడి ఉంటుందంటూ బంగ్లాదేశ్ కొత్త మెలిక పెట్టింది. ఈ మేరకు బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. తమ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా కొత్త ఒప్పందం కోసం చర్చలు జరపాలని భారత్‌ను డిమాండ్ చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఇండోబంగ్లాదేశ్ గంగా నది నీటి ఒప్పందం 1996లో జరిగింది. అప్పటి ప్రధాని షేక్ హసీనా హయాంలో కుదిరిన ఈ డీల్ ఈ ఏడాది డిసెంబర్‌తో ముగియనుంది. కొత్త ఒప్పందం కుదిరే వరకు పాత ఏర్పాట్లే కొనసాగాలని బంగ్లాదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి మీర్జా ఫక్రుల్ ఇస్లాం ఆలంగీర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో జరిగే నీటి ఒప్పందాలకు కాలపరిమితి ఉండొద్దని ఆలంగీర్ షరతు విధించారు. గంగా నదిని బంగ్లాదేశ్‌లో పద్మా నదిగా పిలుస్తారు. అక్కడి వ్యవసాయం, పర్యావరణం, తాగునీటి వ్యవస్థలకు ఈ నది ఎంతో కీలకం. బంగ్లాదేశ్‌లోని మూడో వంతు జనాభా జీవనోపాధి కోసం ఈ నదిపైనే ఆధారపడుతున్నారు. ఫరక్కా బ్యారేజ్ వల్ల తమకు ఎండాకాలంలో నీటి ప్రవాహం తగ్గిపోతోందని బంగ్లాదేశ్ తెలిపింది. దీనివల్ల నదుల్లో ఉప్పునీరు చేరి పంటలు దెబ్బతింటున్నాయని వాదిస్తోంది. మరోవైపు కోల్‌కతా పోర్టు రక్షణ కోసమే ఫరక్కా బ్యారేజ్ నిర్మించినట్లు భారత్ మొదటి నుంచి చెప్తోంది. ఈ ఇబ్బందులను అధిగమించే పేరిట బంగ్లాదేశ్ పద్మా నదిపై ఓ మెగా బ్యారేజ్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఇది 2033 నాటికి పూర్తి చేయాలని ప్రధాని తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని కమిటీ నిర్ణయించింది. ఈ బ్యారేజ్ నిర్మాణంపై భారత్‌తో సంప్రదింపులు జరపాల్సిన అవసరం లేదని బంగ్లాదేశ్ ఏకపక్షంగా నిర్ణయించింది. మరోవైపు తీస్తా నది నీటి ఒప్పందంపై పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీరును కూడా బీఎన్‌పీ నేతలు ఇటీవల విమర్శించారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. సువేందు అధికారి నాయకత్వంలో చర్చలు మళ్లీ మొదలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నీటి సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ఇరు దేశాల మధ్య ప్రత్యేక వేదికలు ఉన్నాయని భారత్ ప్రకటించింది. రెండు దేశాల మధ్య ప్రవహించే 54 నదులపై క్రమబద్ధంగా చర్చలు జరుగుతున్నాయని విదేశాంగ శాఖ తెలిపింది. ఇరు దేశాల ప్రతినిధులు నిరంతరం సమావేశమవుతూనే ఉన్నారని స్పష్టం చేసింది.

## సీబీఎస్‌ఈ 12వ క్లాస్ పేపర్ల మూల్యాంకనంలో AI వాడకంపై స్పష్టత

సీబీఎస్‌ఈ 12వ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంలో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించలేదని బోర్డు స్పష్టం చేసింది. కొత్తగా ప్రవేశపెట్టిన 'ఆన్‌స్క్రీన్ మార్కింగ్' (ఓఎస్‌ఎమ్) విధానంపై విద్యార్థుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ సంజయ్ కుమార్ స్పందించారు. అనేక విశ్వవిద్యాలయాలు ఇప్పటికే ఈ డిజిటల్ మూల్యాంకన విధానాన్ని అనుసరిస్తున్నాయని సంజయ్ గుర్తు చేశారు. ఈ సిస్టమ్‌లో ప్రతి సమాధానాన్ని ఉపాధ్యాయులే స్వయంగా స్క్రీన్‌పై చూస్తూ మార్కులు వేస్తారని వివరించారు. మూల్యాంకన విధానంలో ఎలాంటి మార్పులు చేయలేదన్నారు. కేవలం డిజిటలైజేషన్ మాత్రమే చేశామని తెలిపారు. ఈ ఏడాది దాదాపు 98 లక్షలకు పైగా జవాబు పత్రాలను ఈ విధానంలోనే పరిశీలించినట్లు బోర్డు వెల్లడించింది. అక్కడక్కడా కొన్ని తప్పులు దొర్లే అవకాశం ఉందని అంగీకరించింది. ప్రారంభంలో కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యాయని, వాటన్నింటినీ అధిగమించినట్లు తెలిపింది. విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కారం కోసం మే 19 నుంచి ప్రత్యేక సమీక్షా ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించింది. స్కాన్ చేసిన జవాబు పత్రాల కాపీల కోసం విద్యార్థులు మే 19 నుంచి 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ తర్వాత మార్కుల వెరిఫికేషన్, రీఎవాల్యుయేషన్ కోసం మే 26 నుంచి మే 29 వరకు గడువు ఇచ్చారు. రీఎవాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల నుంచి రూ.100 ఫీజు వసూలు చేస్తారు. ఒకవేళ సమీక్ష తర్వాత విద్యార్థికి

## యూట్యూబ్ ఛానల్ ప్రారంభించిన నారా దేవాన్ష్.. దేని గురించి అంటే?

మంత్రి నారా లోకేష్ తనయుడు నారా దేవాన్ష్ 'Dino Deets' పేరుతో కొత్త యూట్యూబ్ ఛానల్ ప్రారంభించాడు. ఈ సరికొత్త డిజిటల్ ప్రయాణంపై నారా, నందమూరి కుటుంబసభ్యులు దేవాన్ష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఛానల్‌కు సంబంధించిన ప్రమోషనల్ టీజర్‌లో మంత్రి నారా లోకేశ్ కూడా కొడుకుతో కలిసి సందడి చేశారు. ఈ ప్రమోషనల్ వీడియోలో దేవాన్ష్ ప్రారంభించబోతున్న పాడ్‌కాస్ట్ ప్రత్యేకతలను లోకేశ్ అడిగి తెలుసుకున్నారు. డైనోసార్లు, శిలాజాలు (fossils), పురాతన అవశేషాల గురించిన ఆశ్చర్యకరమైన విషయాలను ఈ ఛానల్ ద్వారా దేవాన్ష్ పంచుకోనున్నాడు. నారా దేవాన్ష్ యూట్యూబ్ ఎంట్రీపై తల్లి నారా బ్రహ్మణి సోషల్ మీడియాలో స్పందించారు. శిలాజాలతో నిండిన గది నుంచి దేవాన్ష్ మైక్ ముందుకు రావడం ఎంతో గర్వంగా ఉందని బ్రహ్మణి పేర్కొన్నారు. తమ చిన్నారి క్రియేటర్ లాంచ్ చేస్తున్న పాడ్‌కాస్ట్‌ను చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఛానల్ మొదటి ఎపిసోడ్ శుక్రవారం విడుదల కానున్నట్లు వెల్లడించారు. మరోవైపు నానమ్మ నారా భువనేశ్వరి కూడా మనవడి కొత్త ప్రయత్నాన్ని అభినందించారు. చిన్నారి దేవాన్ష్ ఇలా పాడ్‌కాస్ట్ రంగంలోకి అడుగుపెట్టడం చూసి తాను ఆశ్చర్యంతో పాటు ఎంతో ఉద్వేగానికి లోనయ్యానని చెప్పారు. తనకు ఇష్టమైన డైనోసార్ల టాపిక్‌ను దేవాన్ష్ ఎంతో ఆత్మవిశ్వాసంతో వివరిస్తుంటే తన హృదయం గర్వంతో నిండిపోయిందని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఈ విషయాలపై తండ్రి నారా లోకేశ్ కూడా సోషల్ మీడియాలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ రోజు ఉదయం నిద్ర లేవగానే తనకు కాస్త గందరగోళం కలిగిందని లోకేశ్ పేర్కొన్నారు. గది నిండా డైనోసార్ పుస్తకాలు, డైనోసార్ పెయింటింగ్స్, బొమ్మలు కనిపించడంతో అసలు ఏం జరుగుతుందో అర్థం కాలేదన్నారు. ఆ తర్వాతే డైనోసార్లపై దేవాన్ష్ సొంతంగా పాడ్‌కాస్ట్ చేస్తున్న విషయాన్ని తనకు చెప్పాడని వివరించారు. పిల్లలు ఎప్పుడూ ఊహించని విధంగా సర్‌ప్రైజ్ ఇస్తుంటారని సంతోషం వ్యక్తం చేశారు. దేవాన్ష్ సృష్టించిన ఈ ప్రాచీన ప్రపంచంలోకి ఒక ప్రేక్షకుడిలా ప్రవేశించేందుకు ఆసక్తిగా ఉన్నానని చెప్పారు.

## శాంతి చర్చలు.. ఇరాన్ ముందు అమెరికా ఐదు కఠిన షరతులు

ఇరాన్‌తో జరుగుతున్న శాంతి చర్చల్లో అమెరికా ఐదు కఠిన షరతులు విధించింది. ఇప్పటి వరకు ఇరాన్‌కు జరిగిన నష్టాలకు ఎలాంటి పరిహారం చెల్లించే ప్రసక్తి లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ఓ నివేదికను విడుదల చేసింది. ఇరాన్ తన వద్ద ఉన్న 400 కిలోల శుద్ధిచేసిన యురేనియంను తమకు అప్పగించాలని అమెరికా డిమాండ్ చేసింది. అలాగే ఇరాన్‌లోని అణు కేంద్రాల్లో కేవలం ఒక్కదానికి మాత్రమే అనుమతి ఇస్తామని పేర్కొంది. విదేశాల్లో స్తంభించిపోయిన ఇరాన్ ఆస్తుల్లో కనీసం 25 శాతాన్ని కూడా విడుదల చేయబోమని తెలిపింది. వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణల ముగింపు ఈ చర్చల పురోగతిపైనే ఆధారపడి ఉంటుందని అమెరికా లింక్ పెట్టింది. ఈ ఐదు షరతులకు ఇరాన్ అంగీకరించినా అమెరికా, ఇజ్రాయెల్ నుంచి ముప్పు అలాగే కొనసాగుతుందని వైనెట్ న్యూస్ అభిప్రాయపడింది. మరోవైపు ఇరాన్ కూడా చర్చల కోసం ఐదు షరతులను విధించింది. ముఖ్యంగా లెబనాన్‌లో ఘర్షణలు ఆపాలని, తమపై ఆంక్షలు ఎత్తివేయాలని, స్తంభించిన నిధులను విడుదల చేయాలని కోరింది. యుద్ధ నష్టపరిహారంతో పాటు హర్మూజ్ జలసంధిపై తమ సార్వభౌమాధికారాన్ని గుర్తించాలని డిమాండ్ చేసింది.

## నీట్ పేపర్ లీక్ కేసు.. ఎవరీ మనీషా గురునాథ్? ఆమె పాత్రేంటి?

నీట్ యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ కేసు దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) వేగవంతం చేసింది. ఈ కేసులో పుణెకు చెందిన సీనియర్ బోటనీ టీచర్ మనీషా గురునాథ్ మాంధరేను శనివారం అధికారులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో దేశంలోని వివిధ నగరాల నుంచి ఇప్పటివరకు మొత్తం తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. మనీషా మాంధరే పుణె శివాజీనగర్‌లోని 'మోడ్రన్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్, సైన్స్ అండ్ కామర్స్'లో పనిచేస్తున్నారు. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ)లో సబ్జెక్ట్ నిపుణురాలిగా ఉన్నందున ఆమెకు బోటనీ, జువాలజీ ప్రశ్నపత్రాలను చూసే అవకాశం లభించింది. ఈ క్రమంలోనే మే 3న జరిగిన పరీక్షకు ముందే ఆమె ప్రశ్నలను లీక్ చేశారని సీబీఐ ఆరోపించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆమె మరో నిందితురాలు మనీషా వాఘ్మారే సహాయంతో కొంతమంది నీట్ అభ్యర్థులను ఎంపిక చేశారు. పుణెలోని తన ఇంట్లోనే విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ తరగతులు నిర్వహించారు. ఆ సమయంలో ముఖ్యమైన ప్రశ్నలను నోట్‌బుక్స్‌లో రాయించి, టెక్స్ట్‌బుక్స్‌లో మార్క్ చేయించినట్లు దర్యాప్తులో తేలింది. ఆ ప్రత్యేక తరగతుల్లో చెప్పిన ప్రశ్నల్లో చాలావరకు నీట్ బయాలజీ పరీక్ష పేపర్‌తో సరిపోలాయి. ఈ వ్యవహారంలో ఎన్‌టీఏ అంతర్గత వ్యక్తులు, మధ్యవర్తులు పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి ప్రశ్నలను చేరవేసినట్లు ఏజెన్సీ అనుమానిస్తోంది. కేంద్ర విద్యాశాఖ ఫిర్యాదు మేరకు మే 12న సీబీఐ ఈ కేసును నమోదు చేసింది.

## ఏడు నిమిషాల్లో పనిచేసే క్యాన్సర్ ఇంజెక్షన్

భారతదేశంలో క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక ముందడుగు పడింది. ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగుల కోసం కేవలం ఏడు నిమిషాల్లో పనిచేసే సరికొత్త ఇంజెక్షన్ అందుబాటులోకి వచ్చింది. రోచ్ ఫార్మా ఇండియా సంస్థ 'టెసెంట్రిక్' పేరుతో ఈ ఇమ్యునోథెరపీ మందును మార్కెట్‌లోకి విడుదల చేసింది. గతంలో ఐవీ ఇన్ఫ్యూజన్ ద్వారా ఆసుపత్రిలో గంటల కొద్దీ సమయం తీసుకునే ఈ ప్రక్రియ ఇప్పుడు చర్మం కింది భాగంలో ఇచ్చే ఇంజెక్షన్ ద్వారా కేవలం ఏడు నిమిషాల్లోనే పూర్తవుతుంది. భారతదేశంలో అత్యధికంగా కనిపించే 'నాన్‌స్మాల్ సెల్ లంగ్ క్యాన్సర్' (ఎన్‌ఎస్‌సీఎల్‌సీ) బాధితుల కోసం ఈ చికిత్సను రూపొందించారు. దీనివల్ల రోగులకు ఆసుపత్రిలో వేచి ఉండే సమయం, మానసిక ఒత్తిడి తగ్గుతాయి. ఈ కొత్త పద్ధతి రోగులకు ఎంతో సౌకర్యంగా ఉన్నప్పటికీ, ధర మాత్రం సామాన్యులకు పెనుభారంగా మారింది. ఈ ఇంజెక్షన్ ఒక్క డోస్ ధర దాదాపు రూ.3.7 లక్షలు. క్యాన్సర్ నయం కావడానికి రోగులు సాధారణంగా ఆరు డోసుల వరకు తీసుకోవాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. కీమో థెరపీలా కాకుండా ఇమ్యునోథెరపీ శరీరంలోని రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసి క్యాన్సర్ కణాలపై పోరాడేలా చేస్తుంది. ఈ ఇంజెక్షన్‌లోని 'అటెజోలిజుమాబ్' అనే మందు క్యాన్సర్ కణాల్లో ఉండే పీడీఎల్ 1 ప్రొటీన్‌ను అడ్డుకుంటుంది. ఇది బ్లాక్ అవడం వల్ల శరీరంలోని రోగనిరోధక కణాలు క్యాన్సర్ సెల్స్‌ను సులభంగా గుర్తించి నాశనం చేస్తాయి. ఈ మందుల తయారీలో వాడే అధునాతన సాంకేతికత, లోతైన పరిశోధనల వల్లే ధరలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. రోగులపై ఆర్థిక భారాన్ని తగ్గించడానికి రోచ్ సంస్థ 'బ్లూ ట్రీ' అనే సహాయక కార్యక్రమాన్ని ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్‌ఎస్) కింద కూడా ఈ చికిత్సకు రీయింబర్స్‌మెంట్ సదుపాయాన్ని కల్పించారు.

## 3 గంటల్లో హైదరాబాద్‌ముంబయి

హైదరాబాద్ : హైదరాబాద్ నుంచి దేశ ఆర్థిక రాజధాని ముంబయి నగరానికి ప్రస్తుతం రోడ్డు మార్గంలో అయితే సుమారు 12 గంటలు..రైల్లో అయితే దాదాపు 15 గంటల సమయం పడుతోంది. బుల్లెట్ రైల్లో గంటకు గరిష్ఠంగా 300 కిమీ వేగంతో కేవలం మూడు గంటల్లో చేరుకునేలా హైదరాబాద్ పుణె ముంబయి హైస్పీడ్ రైలు కారిడార్ ప్రణాళికలు తయారయ్యాయి. ఇప్పటికే సర్వే పూర్తి కాగా, తాజాగా డీపీఆర్ కూడా సిద్ధం అయిందని నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్) రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా తెలిపింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యాక బుల్లెట్ (హైస్పీడ్) రైల్లో హైదరాబాద్ నుంచి ముంబయికి కనిష్ఠంగా 2.55 గంటలు, గరిష్ఠంగా 3.13 గంటల్లో చేరుకోవచ్చని పేర్కొంది. ఈ ప్రాజెక్టులో మరో ఆసక్తికరమైన అంశం ఉంది. మహారాష్ట్ర పరిధిలోని మూడు ప్రాంతాల్లో మొత్తం 35.30 కిమీ మేర భూగర్భ మార్గం నిర్మిస్తారు. ఈ కారిడార్‌లోని ఖండాల ఘాట్ ప్రాంతంలో మొత్తం 13 చోట్ల కొండల్ని తొలిచి సొరంగాల నిర్మాణం చేపడతారు. మొత్తం దూరం 24 కిలోమీటర్లు. హైదరాబాద్‌లో మెట్రో రైలు కోసం పిల్లర్లపై నిర్మించిన ట్రాక్ మాదిరిగా హైస్పీడ్ రైలు కారిడార్ నిర్మాణం ఉంటుంది. కొండ ప్రాంతాలు, భూగర్భంలో, నదుల మీదుగా నిర్మాణానికి ప్రతిపాదించిన ఈ హైస్పీడ్ రైలు కారిడార్‌లో అనేక విశేషాలున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా తొమ్మిది రాష్ట్రాల పరిధిలో 7 హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టుల్ని ప్రకటించగా.. ఇందులో 3 హైదరాబాద్ నుంచి ఉన్నాయి. హైదరాబాద్ చెన్నై, హైదరాబాద్‌బెంగళూరు సర్వే దశలో ఉండగా హైదరాబాద్‌పుణెముంబయి ప్రాజెక్టు సర్వే పూర్తి కావడంతోపాటు డీపీఆర్‌ను సైతం ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్ సిద్ధం చేసింది. ఈ కారిడార్ మొత్తం దూరం 671 కిమీ. ఇందులో 93 కిమీ (14 శాతం)తెలంగాణలో, 121 కిమీ (18 శాతం) కర్ణాటకలో, అత్యధికంగా 457 కిమీ (68 శాతం) మహారాష్ట్రలో ఉంటుంది.

**రైలు ఆగే స్టేషన్లు..**

తెలంగాణలో: వికారాబాద్, హైదరాబాద్ (కోకాపేట)

**కర్ణాటకలో: కలబురిగి**

మహారాష్ట్రలో: విఖ్రోలి, థానే, నవీ ముంబయి, లోనావాలా, పింప్రిచించ్వాడ్, పుణె, బారామతి, పంఢర్‌పూర్, సోలాపూర్

## ఇంజినీరింగ్ 73.36 శాతం

హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీలతోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఎప్ సెట్ 2026 ఫలితాలను హైదరాబాద్ లోని జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు విడుదల చేశారు. ఇంజినీరింగ్ లో 73.36 శాతం మంది, అగ్రికల్చర్, ఫార్మసీలో 86.27 శాతం మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఎప్ సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను వారం రోజుల్లో ప్రకటించనున్నట్టు తెలిపారు. ఎప్ సెట్ ఫలితాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ కార్యదర్శి ఎం యోగిత రాణా, కళాశాల విద్య కమిషనర్ శ్రీదేవసేన, ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ కిషన్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్, ఎప్‌సెట్ 2026 కన్వీనర్ ప్రొఫెసర్ విజయకుమార్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి సెక్రెటరీ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, ఎప్ సెట్ కో కన్వీనర్ ప్రొఫెసర్ బాలు నాయక్ పాల్గొన్నారు. ఎప్ సెట్ 2026 పరీక్షల్లో భాగంగా ఈ నెల 4, 5 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలను, ఈ నెల 9 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ పరీక్షలను నిర్వహించిన సంగతి తెలిసిందే. పరీక్షలను నిర్వహించిన కేవలం ఐదు రోజుల్లోనే ఫలితాలను విడుదల చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో 2,10,766 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 1,97,242 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వారిలో 1,44,704 మంది అర్హత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో 90,977 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 84,954 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. అందులో 73,294 మంది అర్హత సాధించారు. అర్హత సాధించిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. వారం రోజుల్లో కౌన్సెలింగ్ తేదీలను ప్రకటించనున్నట్టు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో టాప్10 మంది ర్యాంకర్ల వివరాలను యోగితా రాణా విడుదల చేశారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో టాప్10 ర్యాంకర్ల వివరాలను శ్రీదేవసేన విడుదల చేశారు. ఇంజనీరింగ్‌లో బాలిక ఎం రుషి 156.63 మార్కులతో మొదటి ర్యాంక్ సాధించారు.

## మోడీది స్వదేశీ నినాదం.. విదేశీ వ్యామోహం

**– సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: ప్రధానమంత్రి నరేంద్ర మోడీది స్వదేశీ నినాదం.. విదేశీ వ్యామోహం అని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను నిరసిస్తూ ఆటోకి తాడు కట్టి లాగుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం కొత్తగూడెం పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మోడీ తాను వేసుకునే కోటు, తాగే నీళ్లు, చేతికి పెట్టుకునే వాచి విదేశీవి వాడుతూ ప్రజలకు మాత్రం స్వదేశీ నినాదం ఇస్తున్నారని, స్వదేశీ నినాదం, పొదుపు సూత్రాలు సామాన్య ప్రజలకేనా ఆయనకు వర్తించవా అని ప్రశ్నించారు. ప్రధాని చెబుతున్న పొదుపుమంత్రంతో దేశాభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ప్రభావం ప్రజలపై నేరుగా పడుతుందనీ, గ్యాస్ ధరల పెంపుతో ఇప్పటికే అనేక పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గ్యాస్ ధరలను రెండు దఫాలుగా పెంచిందని విమర్శించారు. ఈ ధరల పెంపు దేశ ఆర్థిక వ్యవస్థపైనా, సామాన్య ప్రజానీకంపైనా తీవ్ర భారాన్ని మోపుతుందని తెలిపారు. ఇరాన్ - అమెరికా, ఇజ్రాయిల్ మధ్య యుద్ధం జరుగుతున్నది కాబట్టి పొదుపు చర్యలు చేపట్టాలని ప్రధాని మోడీ చూపడం విడ్డూరంగా ఉందన్నారు. ఉత్పత్తి దెబ్బతిన్న తర్వాత దేశాభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. యుద్ధం చేస్తున్న వారికి మద్దతిచ్చేలా మోడీ విదేశీ పర్యటనలు ఉంటున్నాయని విమర్శించారు. అమెరికాకు దాసోహం అనడం వల్లనే ఈరోజు ఇరాన్ నుండి హార్మోస్ జల సంధి ద్వారా రావలసిన పెట్రోల్, డీజిల్ రవాణా ఆగిపోవడం వలన ప్రజలపై భారాలు మోపుతున్నారని అన్నారు. తాను విశ్వగురు అని డాంబికలు పలికే మోదీ యుద్ధాన్ని ఆపి అమెరికా మీద ఒత్తిడి తెచ్చి హార్మోజ్ జల సంధిని తెరిపించలేరా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, నాయకులు నందిపాటి రమేష్, నాగకృష్ణ, సతీష్, బాలకృష్ణ, రాములు, సలీం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సంఘం ఎదుగుదల కోసం కష్టపడి పని చేసి అభివృద్ధి పరచాలి

*** అఖిలభారత యాదవ మహాసభ జెనరల్ సెక్రెటరీ జెకె శేఖర్ యాదవ్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : సంఘం ఎదుగుదల కోసం కష్టపడి పని చేసి సంఘాన్ని అభివృద్ధి పరచాలని అఖిలభారత యాదవ మహాసభ జనరల్ సెక్రెటరీ, మేడ్చల్ జిల్లా ఇంచార్జి జెకె శేఖర్ యాదవ్ అన్నారు. అఖిల భారత యాదవమహా సభ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులుగా వల్లపు కుమార్ యాదవ్, గాజులరామారం డివిజన్ అధ్యక్షులుగా జి శ్రీనివాస్ యాదవ్ లు నియమితులయ్యారు. ఈ నియామక పత్రాలను ఆదివారం జగద్గిరిగుట్ట భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో అఖిలభారత యాదవమహాసభ జనరల్ సెక్రెటరీ, మేడ్చల్ జిల్లా ఇంచార్జి జెకె శేఖర్ యాదవ్ చేతుల మీదుగా వారు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘంలో కష్టపడ్డ వారికి సంఘంలో అవకాశాలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున ఆలయ అధ్యక్షులు గంగిరాజు యాదవ్, లెనిన్ నగర్ బస్తి అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, అంజనేయులు సాయి శ్రీకాంత్ నాగరాజు బలేష్ గట్టయ్య రాకేష్ కుమార్ యాదవ్ వీరయ్య.యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు జాప్యం తో రైతు ఆత్మహత్యాయత్నం



జనగామ/లింగాల ఘణపురం, (ప్రజాస్ఫూర్తి): జిల్లా లో ఐకేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా విసుగుచెందిన ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన లింగాల ఘణపురం మండలంలో చోటు చేసుకుంది. మండలం లోని వనభావి గ్రామానికి చెందిన రైతు పొన్నం తిరుమలేష్ తన పై డీజిల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా, అక్కడే ఉన్న స్థానిక రైతులు అప్రమత్తమై అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతు తిరుమలేష్ మాట్లాడుతూ, ధాన్యాన్ని అమ్మేందుకు నెల రోజుల క్రితమే కల్లంలో పోసినా ఇప్పటికీ కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టోకెన్ విధానం ద్వారా కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పినా, తన తరువాత వచ్చిన రైతుల ధాన్యాన్ని ముందుగా కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. నెల రోజులుగా ధాన్యం కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తున్న సంబంధిత సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని, వెంటనే తన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతు డిమాండ్ చేశారు. ఈ ఘటనతో కొనుగోలు కేంద్రం వద్ద ఉద్రిక్తత నెలకొంది.

## మోడీ బంగ్లాస్ నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు



కాప్రా , ప్రజాస్ఫూర్తి: మోడీ బంగ్లాస్ కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు బొంతు రామ్మోహన్, బొంతు శ్రీదేవి యాదవ్ దంపతులను వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చెన్నం గోపి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఇటీవల ఎన్నికైన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన సభ్యులను బొంతు దంపతులు శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ చెన్నం గోపి, సెక్రటరీ హరికృష్ణ, ప్రభు గౌడ్, ట్రెజరర్ శ్రీనివాస్, ప్రసాద్, సునీల్ కుమార్, రమేష్ చంద, రమణ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం సహించబోం

*** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారుల ను ఆదేశించారు. ఆదివారం జిల్లా లోని పలు ధాన్యం కొను గోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి కొనుగోళ్ల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించారు. దేవరుప్పుల మండలం, కామారెడ్డిగూడెం, కొడకండ్ల మండలం, గిర్ని తండా, మొండ్రాయి, చెన్నూ రు, తీగారం, కొడకండ్ల, పాకాల, రామవరం, చెరువుముండటి తండా, రామన్నగూడెం గ్రామాల తో పాటు పాలకుర్తి మండలం లోని వల్మిడి, ముత్తారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొను గోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీ లించారు. ఈ సందర్భంగా కొడకండ్ల మండలంలోని గిర్ని తండా కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహించిన సీ.సీ (సెంటర్ ఇన్‌చార్జి) పై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత సీ.సీ కి చార్జ్ మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పాలకుర్తి మండలం లోని ముత్తారం గ్రామ కొనుగోలు కేంద్రం లో రైతులు రైస్ మిల్ మార్పు కోరడంతో సమీపం లోని రైస్ మిల్‌కు ధాన్యాన్ని కేటాయిం చాలని అధికారులకు సూచించా రు. పాలకుర్తి మండలం లోని ఏడునూతుల గ్రామంలో ఉన్న కొనుగోలు కేంద్రంలో ఐదు లారీల ధాన్యం బస్తాల వివరాలు ట్రక్ షీట్ లో నమోదు కాకపోవడం పై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత సీ.సీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం తో వెంటనే సస్పెండ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ, కొనుగోలు కేంద్రాల్లో పెండింగ్ లో ఉన్న ఓపీఎంఎస్ నమోదును త్వరగా పూర్తి చేయా లని సూచించారు. ధాన్యం తరలింపులో జాప్యం లేకుండా లారీలతో పాటు ట్రాక్టర్లను కూడా వినియోగించి బస్తాలను సంబంధిత రైస్ మిల్లులకు తరలించా లని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల లో ఎఫ్.ఏ.క్యూ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. రైతు లకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## యువజన, క్రీడల వారోత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలి

*** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజాస్ఫూర్తి : 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యం లో 18 వ తేదీ నుంచి 23 వరకు జిల్లా, మండల స్థాయిలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటన లో, యువతలో శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు, నైపుణ్యా భివృద్ధి, సామాజిక బాధ్యతలను పెంపొందించే ఉద్దేశంతో, ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నేడు మారథాన్ (వాక్ అండ్ రన్), శారీరక దృఢత్వ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ఉదయం 6 గంటలకు జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాల యం నుంచి చౌరస్తా మీదుగా ధర్మకంచ మినీ స్టేడియం వరకు 2 కే రన్ నిర్వహిస్తారని, అనంత రం ఉదయం 7 గంటలకు యోగా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయిలో ఆయా మండల కేంద్రాల్లో ఎంపీడీ ఓ ల ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడతారని వెల్లడించారు. 19 వ తేదీన కెరీర్, నైపుణ్యత దినోత్సవాన్ని జిల్లా కేంద్రం లోని ధర్మకంచ మినీ స్టేడియం లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 20 వ తేదీన యువ నాయకత్వ సదస్సు, పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నా రు. 21 వ తేదీన ఉదయం 7 గంటలకు క్రీడా దినోత్సవ కార్యక్రమం జరగనుందని తెలిపారు. 22 వ తేదీన సేవా రంగంలో యువతలో సామాజిక బాధ్యత ను పెంపొందించే కార్యక్రమాలు జిల్లా స్థాయిలో ధర్మకంచ మినీ స్టేడియంలో, మండల స్థాయిలో మండల హెడ్‌క్వార్టర్స్ లో ఎంపీ డీఓ ల ఆధ్వర్యంలో నిర్వహించ నున్నట్లు స్పష్టం చేశారు. 23 వ తేదీన ఉదయం 11 గంటలకు ఉద్యోగ సాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వరంగల్ జిల్లా లో మే 8 న నిర్వహించిన జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన జిల్లా యువతకు నియామక పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సీఎం కప్ - 2025 రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని యువత, క్రీడాకారులు, ప్రజలు ఈ కార్యక్ర మాల్లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

*** జిల్లా కలెక్టర్ కె. హరిత**



ప్రజా స్ఫూర్తి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆదివారం విద్యా వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యా విజయోత్సవ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ కాప్దే అనిల్ కుమార్, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్‌లతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని విద్యార్థులు కష్టపడి చదివి ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. మండల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు తెలియజేసి పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్యను పెంచాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వ స్థానిక సంస్థల ఉన్నత పాఠశాలల నుండి 10వ తరగతిలో జిల్లా టాపర్లుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలల నుండి జిల్లా స్థాయి టాపర్లుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు, క్రీడలలో జాతీయ స్థాయిలో పాల్గొన్నటువంటి ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి 10వేల రూపాయలు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగినది. ప్రభుత్వ స్థానిక సంస్థల ఉన్నత పాఠశాలల నుండి మండల స్థాయి టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రము, జ్ఞాపిక అందించడంతో పాటు ఉల్లాస్ లో వాలంటీర్లుగా సేవలందించిన ఇద్దరికీ ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి లలిత, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ అలీ బిన్ అహ్మద్, మున్సిపల్ వైస్ చైర్మన్ అహ్మద్, , ఏ సి జి ఈ జనార్ధన్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, కోఆర్డినేటర్లు లతీఫ్, శాంతి కుమార్, భాగ్యలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారి రాథోడ్ సుభాష్, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అంతా మా ఇష్టం..!

*** బెల్టు షాపుల వద్ద నడి రోడ్డుపై వాహనాలు నిలిపివేత**

*** రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్న స్థానికులు**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వ అధికారుల కనుసన్నల్లో కొనసాగుతున్న బెల్టుషాపుల వద్ద మందుబాబులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. అంతా మా ఇష్టం అన్నట్లుగా తమ వాహనాలను సిండికేట్ బెల్టుషాపుల ఎదుట నడి రోడ్డుపై అడ్డంగా నిలిపివేస్తున్నారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ క్లబ్ ఏరియాలో ఇళ్ల మధ్యలోనే ''సిండికేట్'' మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రామవరం, చిట్టి రామవరం, త్రీ ఇంక్లైన్, 4 ఇంక్లైన్, రుద్రంపూర్, గరీబ్‌పేట్ తదితర ప్రాంతాలకు చెందిన బెల్ట్ షాపుల నిర్వాహకులు రామవరంలోని సిండికేట్ వైన్స్ నుండే మద్యం తీసుకెళ్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మద్యం తీసుకెళ్లేందుకు వచ్చే వాహనాలు, ఆటోలు నడిరోడ్డుపైనే నిలిపివేయడంతో బస్తీవాసుల రాకపోకలకు ఇబ్బందుల తలెత్తుతున్నాయి. క్లబ్ ఏరియాకు చెందినవారు ఈ దారి గుండానే ప్రధాన రహదారికి చేరుకుని ఆటోలు ఎక్కాల్సి ఉంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు ఈ దారిగుండా రాకపోకలు సాగించాలంటే భయాందోళనకు గురవుతున్నారు. మద్యం తాగేందుకు బెల్టుషాపులకు వచ్చినవారు రోడ్డుపై వెళ్లే మహిళలపట్ల అసభ్యంగా చూడటం, ప్రవర్తించడం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ సిండికేట్ మద్యం వ్యాపారంపై సోషల్ మీడియా, పత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ ఎక్సైజ్, పోలీస్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నెలవారీ టార్గెట్‌లను పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులే స్వయంగా బెల్టు దుకాణాలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం స్టాక్ వచ్చిన సమయంలో డీసీఎం వాహనాలను నడిరోడ్డుపైనే నిలిపి సరుకును గదుల్లోకి తరలిస్తున్నారని, ప్రశ్నించిన వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని మహిళలు చెబుతున్నారు. దీంతో బస్తీలో భయాందోళన వాతావరణం నెలకొంది. ఇళ్ల మధ్యలో కొనసాగుతున్న ఈ మద్యం సిండికేట్ కేంద్రాన్ని వెంటనే తొలగించాలని మహిళలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజావాణికి సకాలంలో హాజరు కావాలి: కలెక్టర్

ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని, సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం భద్రాచలం సబ్ కలెక్టర్, కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు

*** జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహణలో భాగంగా ప్రజల సౌకర్యార్థం జిల్లాలోని మెదక్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా జూన్ 15వ తేదీ నుండి 24వ తేదీ వరకు మొదటి సన్నాహక, శిక్షణ, ముద్రణ కార్యక్రమాలు, జూన్ 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారుల ఇంటింటి సందర్శన, జూలై 24వ తేదీన పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, 31వ తేదీన ముసాయిదా జాబితా ప్రచురణ నిర్వహించడం జరుగుతుందని. జూలై 31వ తేదీ నుండి ఆగస్టు 30వ తేదీ వరకు ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని, సెప్టెంబర్ 28వ తేదీ వరకు ఫిర్యాదులు, అభ్యంతరాల పరిష్కారం ప్రక్రియ తరువాత అక్టోబర్ 1వ తేదీన తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రజల సౌకర్యం కంట్రోల్ రూమ్ 9553866388 నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని, పని దినాలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందని,సందేహాలు,సమాచారం కొరకు కంట్రోల్ రూమ్ లో సంప్రదించవచ్చని తెలిపారు.


## జర్నలిస్టు సంక్షేమానికి జె ఎస్ ఎస్ కట్టుబడి ఉంటుంది

*** రాష్ట్ర ఈసీ మెంబర్ గా దేవేందర్ నాయక్ నియామకం.**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : వరంగల్ జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రథమ సమావేశం ఆదర్శ లా కాలేజీలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హనుమకొండ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు హెల్త్ కార్డులు ఇవ్వడానికి ప్రభుత్వంతో మాట్లాడుతున్నామని ముఖ్యమంత్రి కూడా ఈ విషయాన్ని వివరించామని తెలియజేశారు. త్వరలోనే జర్నలిస్టుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు ఈ కార్యక్రమానికి మరో ముఖ్యఅతిథిగా జర్నలిస్టుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు మనసాని కృష్ణారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టు సంక్షేమం కోసం మన యూనియన్ కట్టుబడిందని యూనియన్ ను బలోపేతం చేసి జర్నలిస్టులను ఎల్లవేళలా కాపాడుకుంటామని ప్రభుత్వం జర్నలిస్టులను గుర్తించి వారికి ఉపాధి మార్గాలు చూపించే విధంగా పోరాటం కొనసాగిస్తామని తెలియజేశారు అంతేకాకుండా రాష్ట్ర కమిటీ జిల్లా కమిటీలను నియమించడం జరిగింది ఈ కమిటీలో హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన ప్రజా దర్బార్ రిపోర్టర్ లావుడ్య దేవేందర్ నాయక్ ను రాష్ట్ర ఈసీ మెంబర్ గా నియమించినట్లు తెలిపారు. నేటి నుంచి దేవేందర్ నాయక్ రాష్ట్రస్థాయి బాధ్యతలు చేపడతారని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జర్నలిస్టుల సంక్షేమ సంఘం నాయకులు పరకాల వంశీ కృష్ణ, గుర్రపు శ్రీనివాస్, ముత్తోజు దామోదర్ సంక్షేమ సంఘం నాయకులు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీళ్లు నోచుకోని ఎస్సీ కాలనీ వాసులు



మహబూబాబాద్, ప్రజా స్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బేతోలు గ్రామం 6వ వార్డులో ఉన్న ఎస్సీ కాలనీ ప్రజలు తీవ్రమైన తాగునీటి సమస్యతో నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని ఇతర ప్రాంతాలకు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా జరుగుతున్నప్పటికీ, ఎస్సీ కాలనీకి మాత్రం ఇప్పటికీ సరైన కలెక్షన్ ఇవ్వకపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయిందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. కాలనీ ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం, గతంలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను కాలనీ వరకు వేశారు. అయితే నీటి కనెక్షన్ పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో ఇప్పటికీ కాలనీ ప్రజలకు ఆ నీరు అందడం లేదని వాపోయారు. దీంతో ప్రజలు పాత నల్లబావి నీటిపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం ఆ బావిలో కూడా నీటి మట్టం తగ్గిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు.ఈ కార్యక్రమంలో షేక్ ఖాదర్ బాబా, గద్దపాటి సంతోష్, పాల్వాయి పీరయ్య, ఎరుపుల రాజు, పాల్వాయి శ్రీను, గద్దపాటి వేణు; కిన్నరి ముత్తయ్య, పాల్వాయి ఉమా, సగరం పద్మ, సుధనబోయిన నాగలక్ష్మి, పాల్వాయి రేణుక, మోటుపల్లి చంద్రమ్మ, మీసాల సుభద్ర, పాల్వాయి జయ తదితరులు పాల్గొన్నారు.

# కాప్రా చెరువుకు మహర్దశ


* **రూ.35 కోట్లతో కాప్రా చెరువు సుందరీకరణ పనుల ప్రారంభం**



కాప్రా , ప్రజాస్ఫూర్తి: కాప్రా చెరువును సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.35 కోట్ల నిధులు కేటాయించినట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బైరీ నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో కాప్రా చెరువు పునరుద్ధరణ మరియు సుందరీకరణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాప్రా ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో చెరువు అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. చెరువు పరిసరాలను పచ్చదనంతో అభివృద్ధి చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్‌లు, పార్కులు, ఆధునిక లైటింగ్ వ్యవస్థ, విశ్రాంతి ప్రదేశాలు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం కాప్రా చెరువు నగరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, ప్రభుదాస్, శ్రీనివాస్ రెడ్డి, గొల్లూరి అంజయ్య, పన్నాల దేవేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమశేఖర్ రెడ్డి, సాయి జెన్ శేఖర్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, గంధం నాగేశ్వర్ రావు, నీలం రెడ్డి, దామోదర్, బీఏ రాంచందర్ గౌడ్, సంజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగిఉండాలి

* **మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ రఘుపతి రెడ్డి, స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్స్‌కు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు.శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా, సమాజంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలని సూచించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ,రౌడీ షీటర్స్ తమ పాత నేరప్రవర్తనలను పూర్తిగా విడనాడి,మంచి పౌరులుగా మారాలని సూచించారు. ఎవరైనా తిరిగి నేర కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు భయాందోళనలు కలిగించే చర్యలు,గొడవలు, బెదిరింపులు,అక్రమ కార్యకలాపాలు, గంజాయి,ఇతర మత్తు పదార్థాల వ్యవహారాలలో పాల్గొనరాదని స్పష్టం చేశారు.యువత చెడు మార్గాల్లో వెళ్లకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు సహకరించాలని తెలిపారు.సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ రాంచరణ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# టీపీఏ డిసినరీ అవార్డ్స్ గాలా–2026 అవార్డును అందుకున్న శ్రీకాంత్




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: హైదరాబాద్‌లో తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీపీఏ డిసినరీ అవార్డ్స్ గాలా-2026లో హర్యానా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా జిల్లాకు చెందిన మజ్జిగ శ్రీకాంత్ అవార్డు అందుకున్నారు. సుజాతనగర్ మండలానికి చెందిన శ్రీకాంత్ మనో విజ్ఞాన శాస్త్రం, మానసిక ఆరోగ్య అవగాహన రంగాల్లో అందించిన సేవలకు గాను డెకేడ్ ఆఫ్ సర్వీస్ అవార్డ్, మైండ్ అండ్ మెరిట్ అవార్డులు లభించాయి. గత 10 సంవత్సరాలుగా శ్రీకాంత్ కౌన్సెలింగ్ సైకాలజిస్టు, సైకోథెరపిస్ట్, ఫ్యామిలీ కౌన్సెలర్, లైఫ్ స్కిల్స్ ట్రైనర్‌గా సేవలందిస్తున్నారు. భారతదేశంతోపాటు అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా, మధ్యప్రాచ్య దేశాల ప్రజలకు కూడా శ్రీకాంత్ కౌన్సెలింగ్ సేవలు అందిస్తూ అంతర్జాతీయ స్థాయిలో తన ప్రతిభను చాటుతున్నారు. ఎం.ఎస్‌సి సైకాలజీతోపాటు కౌన్సెలింగ్, రిహాబిలిటేషన్ సైకాలజీలో ప్రత్యేక డిప్లొమాలు పూర్తి చేసిన శ్రీకాంత్ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో బి.ఎడ్ పూర్తి చేశారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్‌లో శిక్షణ పొందిన శ్రీకాంత్‌కు మానసిక ఆరోగ్య రంగానికి చేసిన సేవలకుగాను గౌరవ డాక్టరేట్ కూడా లభించింది. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను జిల్లాకు చెందిన పలువురు అభినందించారు.

# ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు నజీర్‌కు ఆహ్వానం



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: చెతన్య సారస్వత పరిషత్ సౌజన్యంతో అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో జూన్ 6, 7 తేదీల్లో నిర్వహించనున్న 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు కొత్తగూడెంకు చెందిన సయ్యద్ అబ్దుల్ నజీర్‌కు ఆహ్వానం లభించింది. చైతన్య సారస్వత పరిషత్ అధ్యక్షులు, కిమ్స్, గ్లోబల్ యూనివర్సిటీ అధినేత కె.వి.వి. సత్యనారాయణరాజు సౌజన్యంతో, సాహిత్య భూషణ్ కత్తిమండ ప్రతాప్‌కుమార్ సారథ్యంలో ఈ మహాసభలు జరగనున్నాయి.


# మాయమైన డొంక రోడ్డు...!

* **కబ్జాకు గురైన లక్ష్మీదేవిపల్లి – చాతకొండ రహదారి**
* **సర్వేలతో కాలయాపన... పట్టించుకోని ప్రభుత్వ అధికారులు**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రైతులు సౌకర్యార్థం సుమారు 37 సంవత్సరాల క్రితం దారి కోసం కేటాయించిన ప్రభుత్వ భూమి నేడు కబ్జాకు గురై కానరాకుండా పోయింది. ఏజెన్సీ చట్ట పరిధిలో ఉన్నప్పటికీ అక్రమార్కులు నిర్భయంగా డొంక రోడ్డును కబ్జా చేసి క్రయ విక్రయాలు జరుపుతూ కోట్ల రూపాయలతో జేబులు నింపుకుంటున్నారు. రోడ్డుపై ప్రశ్నలు తలెత్తినప్పుడల్లా ప్రభుత్వ అధికారులు సర్వేల పేరుతో కాలయాపన చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా 44 అడుగుల వెడల్పుతో 10 కిలోమీటర్ల మేర ఉండాల్సిన రహదారి కాస్తా నేడు పూర్తిగా కన్పించకుండా పోయింది.

**రోడ్డు ఏర్పాటైందిలా...**

నేటి లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ రామవరం ప్రాంతం నుంచి లక్ష్మీదేవిపల్లి మీదుగా చాతకొండ గ్రామ పంచాయతీ వరకు రైతులు రాకపోకలు సాగించేందుకు రహదారి సౌకర్యం లేకపోవడంతో రైతుల విజ్ఞప్తి మేరకు 1989లో ప్రభుత్వం కొంత స్థలాన్ని రోడ్డు కోసం కేటాయించింది. ఐఏఎస్ అధికారి మహమ్మద్



జియాఉద్దీన్ ఆధ్వర్యంలో సర్వే పనులు చేపట్టి సుమారు 40 అడుగుల వెడల్పుతో 10 కిలోమీటర్ల మేర రహదారికి హద్దులు సైతం నిర్ణయించి సెంట్రల్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయం ద్వారా డొంక రోడ్డును కేటాయించింది. 2003 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జన్మభూమి పథకం ద్వారా పనికి ఆహార పథకంలో భాగంగా డొంక రోడ్డును కాస్తా మట్టిరోడ్డుగా మార్చారు. అయితే ఆ తరువాత క్రమంలో ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో ఈ రోడ్డు వినియోగం తగ్గిపోయింది.

* **కబ్జాకు గురైన 10 కి.మీల మేర రహదారి**

కారుకొండ రామవరం, లక్ష్మీదేవిపల్లి, చాతకొండ ప్రాంతాలు దినదినాభివృద్ధి చెందుతుండటంతో కబ్జాదారుల కన్ను డొంక రోడ్డుపై పడింది. గత కొన్నేళ్లుగా కొద్దికొద్దిగా డొంక రోడ్డును కబ్జా చేసుకుంటూ రావడంతో ప్రస్తుతం ఆ రహదారి పూర్తిగా కనుమరుగైంది. పలువురు ఆక్రమణదారులు ఈ దారిని కొద్దికొద్దిగా ఆక్రమిస్తూ ప్లాట్లుగా మార్చి వాటికి దొంగ పత్రాలు సృష్టించి విక్రయాలు జరిపినట్లు తెలుస్తోంది. గ్రామ పంచాయతీ అధికారులు సైతం ఎలాంటి విచారణ జరపకుండానే రోడ్డును కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలకు ఇంటినెంబర్లు కూడా కేటాయించడం విశేషం. 1/70 చట్ట పరిధిలో ఉన్నటువంటి ఈ 10 కిలోమీటర్ల రహదారిలో ఎక్కువ శాతం గిరిజనేతరులే కొనుగోళ్లు జరిపి శాశ్వత నిర్మాణాలు చేపట్టడం గమనార్హం.

* **రోడ్డును పునరుద్ధరించాలని డిమాండ్**

కబ్జాకు గురైన రోడ్డు విషయమై గతంలో అనేక ఫిర్యాదులు రావడంతో సంబంధిత అధికారులు సర్వేల పేరుతో కాలయాపన చేస్తూ వస్తున్నారు. ప్రతీసారి సర్వేచేసి అక్రమ నిర్మాణాలను తొలగించి రహదారిని పునరుద్ధరిస్తామని చెప్పడమే తప్ప సమస్యను పరిష్కరించిన దాఖలాలు కన్పించడంలేదు. అధికారుల తీరుతో ఈ రోడ్డు గురించి పోరాడుతున్నవారు విసిగి వేసారిపోయారు. గతంలోనూ తహశీల్దార్ పేరుతో బ్యానర్లు ఏర్పాటు చేయడం గమనార్హం.



కాగా కబ్జాకు గురైన రోడ్డును అందుబాటులోకి వస్తే వ్యవసాయంపై ఆధారపడిన ఆ ప్రాంత రైతులకు కొత్తగూడెం పట్టణానికి రాకపోకలు సాగించడానికి వీలు కలుగుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు స్పందించి కబ్జాకు గురైన రోడ్డుపై సర్వే నిర్వహించి, అక్రమ నిర్మాణాలను తొలగించి, కబ్జాకు గురైన రోడ్డును పునరుద్ధరించి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు

# భవిష్యత్తుకు బలమైన పునాది విద్య

* **జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**




నల్గొండ, ప్రజాస్ఫూర్తి : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నల్గొండ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన విద్యా విజయోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. మొదటి స్థానంలో నిలిచిన 13 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల రూపాయల నగదు బహుమతిని అందజేశారు. కేజీబి వి , మోడల్ స్కూల్‌లకు చెందిన 5 మంది విద్యార్థులు, స్పోర్ట్స్ స్కూల్ నుండి 4 మంది, జూనియర్ కళాశాలల నుంచి 3 విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఇష్టంతో, కష్టపడి చదవాలని చెప్పారు. పదవ తరగతితో చదువును ఆపకుండా ప్రతి విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించాలని, పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు చదివితేనే నేటి పోటీ ప్రపంచంలో మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. గ్రాడ్యుయేషన్ విద్యతో జీవితంలో గొప్ప మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. పై చదువులకు వెళ్లే విద్యార్థులకు సరైన దిశానిర్దేశం అవసరమని, ఉపాధ్యాయులు,ఎంఈఓలు విద్యార్థులను ప్రోత్సహించే బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్మీడియట్ లేదా పాలిటెక్నిక్ వంటి కోర్సుల్లో చేరేలా ప్రోత్సహించాలని కోరారు.అనంతరం మానసిక దివ్యాంగులకు అవసరమైన కిట్‌లను జిల్లా కలెక్టర్ అందజేసి వారి పట్ల సామాజిక బాధ్యతను తెలియజేశారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి దస్రునాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి , ఎంఈఓ లు , ఉపాధ్యాయులు, విద్యార్థులతల్లిదండ్రులు హాజరయ్యారు.

# సింగరేణి వాస్తవ లాభాలను ప్రకటించాలి

* **ఏఐటియుసి అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి సంస్థ గడిచిన ఆర్థిక సంవత్సరంలో గడించిన వాస్తవ లాభాలను ప్రకటించాలని, అంతేకాక జెన్కో నుండి సింగరేణికి రావాల్సిన సుమారు రూ.53 వేల కోట్ల బకాయిలను వెంటనే వసూలు చేయాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఇటీవల డైరెక్టర్ (పా)తో చర్చించిన అంశాల గురించి ఆదివారం కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వెల్లడించారు. కొత్త ప్రాజెక్టులను తీసుకువచ్చి సంస్థ మనుగడను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గనుల్లో ఉత్పత్తి లక్ష్యం కోసం కార్మికులపై ఒత్తిడి మానుకోవాలని అన్నారు. మెడికల్ బోర్డ్‌పై చర్చల్లో యాజమాన్యం ఒప్పుకున్న విధంగా పాత పద్ధతిలో మెడికల్ బోర్డ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఓబీలను సింగరేణి టేక్ ఓవర్ చేసుకొని సంస్థ మనుగడను కాపాడాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో సింగరేణి ప్రాజెక్ట్‌లపై శ్వేతపత్రం విడుదల చేయాలని యాజమాన్యాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్‌టియుసి తప్పుడు ప్రచారాలతో కార్మికులను మభ్యబెడుతున్నారని విమర్శించారు. కేంద్రం నూతన లేబర్ కోడ్‌లను సింగరేణిలో వ్యతిరేకిస్తున్నామని ముక్తకంఠంతో చెప్పారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, పాత యంత్రాల స్థానంలో కొత్త యంత్రాలను సమకూర్చాలని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటియుసి నిరంతరం పోరాటం చేస్తుందని, యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొస్తూ సమస్యలు పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ క్రిస్టోఫర్, పిట్ కార్యదర్శులు మధు కృష్ణ, కమల్, సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా రూపా కల్పనలు

# కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి..

* **ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు,- కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులు**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పట్ల పార్టీ నాయకులు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. శంభీపూర్ లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధ్యక్షతన శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్ కార్యక్రమం ప్రారంభమైన నాటి నుండి దేశవ్యాప్తంగా వివిధ రకాల విమర్శలు వ్యతిరేకత వ్యక్తం అవుతుందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని పార్టీకి చెందిన నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లు (బిఎల్ఎ)లు జాగ్రత్తతో వ్యవహరించాలని చెప్పారు. మరణించిన ఓటర్లను జాబితా నుండి తొలగించడం 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటరుగా చేర్చడం జరుగుతుందన్నారు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. వివిధ రాష్ట్రాలు వివిధ భాషలకు చెందిన వారు వచ్చి స్థిరపడి ఓటర్లుగా నమోదయ్యారన్నారు. సర్వే కార్యక్రమంలో ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ప్రజల జాగ్రత్తగా ఉండేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహణ పాటించవలసిన నియమ నిబంధనలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాయకులకు అవగాహన కల్పించారు. 2000టు జనాభా ప్రతిపాదికను ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో నిజమైన ఓటర్లను గుర్తించడంతో పాటు డూప్లికేట్ ఓట్లు, పర్మనెంట్ మైగ్రేటెడ్ ఓట్లు, అసలు మనుషులు లేని పేర్లతో ఉన్న ఓట్లను గుర్తించడం కుటుంబ సభ్యుల ఓట్లను మ్యాపింగ్ చేయడం కొత్త ఓటర్లను చేర్చడం ఇంకా ఏమైనా చేర్పులు మార్పులు ఉంటే వాటిని సరిదిద్దేలా నాయకులు బిఎల్ఏలు సంక్షేమ సంఘాల నాయకులు సీనియర్ సిటిజన్స్ యువత ఒక బాధ్యతగా తీసుకొని ప్రజలను చైతన్య పరుస్తూ అధికారులను సమన్వయ పరుచుకుంటూ సర్ కార్యక్రమాన్ని సద్వినియోగం పరుచుకోవాలనేలా పనిచేయాలన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ ఆధ్వర్యంలో పార్టీ బలోపేతంపై చేపటనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం నూతన కమిటీల నియామకంతో పాటు పార్టీ బలోపేతానికి మరింత ప్రజల్లోకి ఎలా దూసుకెళ్లాలని చేపట్టాల్సిన కార్యాచరణను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు పలు డివిజన్లకు చెందిన పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పలు సంక్షేమ సంఘాల నాయకులు, మహిళా నాయకురాలు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయానికి బుక్స్ డొనేషన్




నల్గొండ, ప్రజాస్ఫూర్తి : గ్రంథాలయానికి బుక్స్ డొనేషన్ చేయడం అభినందనీయమని జిల్లా గ్రంథాలయ చైర్మెన్ డా ,,హఫీజ్ ఖాన్ తెలిపారు . పుస్తకాలు అందజేసిన సిరిప్రోలు వెంకట పతి కి అయన కృతజ్ఞతలు తెలిపారు. సిరిపోలు వెంకటపతి ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రంథాలయానికి ట్రస్ట్ చైర్మెన్ సిరిప్రోలు వెంకట పతి బుక్స్ డొనేషన్ చేశారు. ఈ బుక్స్ ను జిల్లా గ్రంథాలయ చైర్మెన్ డా హఫీజ్ ఖాన్ కు అందజేశారు .ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మెన్ డా హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ సిరిపోలు వెంకటపతి ట్రస్ట్ సేవలు అందరికి తెలిసినవే నని, ఈ సేవా కార్యక్రమాలలో భాగంగా గ్రంథాలయానికి ట్రస్ట్ చైర్మెన్ సిరిప్రోలు వెంకట పతి బుక్స్ డొనేషన్ చేయడం ఎంతో అభినందనీయమన్నారు . సిరిపోలు వెంకటపతి ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రంథాలయానికి అందజేసిన పుస్తకాలను గ్రామీణ ప్రాంతాల నుండి గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులకు ఉపయోగ పడే విధంగా కృషి చేస్తామని చెప్పారు . ఈ కార్యక్రమంలో సిరిపోలు వెంకటపతి ట్రస్ట్ చైర్మెన్ సిరిపోలు వెంకటపతి ,నర్సింహా రెడ్డి , యూనుస్ , మల్లారెడ్డి , లియా కత్, ఇనాయత్ , శ్రీ లక్ష్మి , యాదగిరి , గ్రంథాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

# ఎంసెట్ ఫలితాలలో గౌతమి ప్రభంజనం..



ప్రజా స్ఫూర్తి, నల్గొండ: ఆదివారం ప్రకటించిన తెలంగాణా ఎప్సెట్ ఫలితాలలో గౌతమి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి నల్లగొండ జిల్లాకే వన్నెతెచ్చారు. ఇంజనీరింగ్ విభాగంలో సాత్విక్ రెడ్డి 873, సోమేశ్వరి 929, వైష్ణవి.కె 954, సౌమ్య .కె 2026, అనుష్న . 2643.. 2 3267, 65 3 3280. 5 2 3292, 0 4424, 8. 85 5916, 3 6163. అజిజుర్ రహమాన్ 7339, నీరజ్ నారాయణ 9267, స్రావ్య పి 9384, అయాన్. యండి 9620, లహరిక కె 10781, హేమ చందర్ 10795, 5 11271, 5 3 11970, 13042, 5. 3 13289, 2. 2 13345. భానుమతి .కె 14459, అనుడి 14565, అమూల్యకె 14745, సాయి హర్ష. ఎస్ 15300, నాగ సంజన. వి 15502, రాజేష్, కె 17428, లహరి యం 17706, తేజస్వినీ. ఎన్ 17944, సిరి. ఎం 18623, ఆఫియా నాజ్ 18838, శివ దీక్షిత ఎం 19000, సుష్మ ఇ 19118, యోగితా రాజ్ పై 19256 ర్యాంకులు సాదించారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం కాసర్ల వెంకట్ రెడ్డి, చల్లా వెంకట రమణ, కొమ్మిడ్ రఘుపాల్ రెడ్డి, పుట్టా వెంకట రమణా రెడ్డి లు అభినందించారు.

# కొనుగోలు కేంద్రంలో ఆగిన రైతు గుండె



నెక్కొండ : కొనుగోలు కేంద్రంలో రైతు గుండెపోటుతో మృతిచెందిన ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంఖానిపేట గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాజుల పెద్ద వెంకటేశ్వర్లు(65) తనకున్న మూడెకరాల్లో వరి సాగు చేశారు. మూడురోజుల క్రితం వరి కోత పూర్తి కాగా.. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చారు. ఉదయం, సాయంత్రం ధాన్యం నెరుపుతున్నారు. రెండురోజుల క్రితమే ఛాతిలో నొప్పిగా ఉందని తన భార్యకు చెప్పిన వెంకటేశ్వర్లు.. ధాన్యం తూకం పూర్తికాగానే ఆసుపత్రికి వెళదామన్నారు. ఆదివారం ఉదయం కొనుగోలు కేంద్రంలో ధాన్యం నెరుపుతూ.. అక్కడే కుప్పకూలిపోయారు. గమనించిన రైతులు వెంటనే స్థానిక ఆర్ఎంపీకి సమాచారం అందించారు. అతను వచ్చి సీపీఆర్ చేసినా.. ఫలితం లేకపోయింది.

# తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు విడుదల.. టాప్ ర్యాంకర్లు వీళ్లే

- ఫలితాలు విడుదల చేసిన కేశవరావు
- eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌లో ర్యాంకులు
- పరీక్షలు పూర్తయిన ఆరో రోజే ఫలితాలు

తెలంగాణలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్ (EAPCET) ఫలితాలు విడుదలయ్యాయి. ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి సమక్షంలో ఆదివారం హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో ఫలితాలను విడుదల చేశారు. విద్యార్థులు eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌లో తమ ర్యాంకులను తెలుసుకోవచ్చు. పరీక్షలు పూర్తయిన కేవలం ఆరో రోజే ఫలితాలను విడుదల చేస్తుండటం ఈసారి ప్రత్యేకత. ఈ ఏడాది పరీక్ష రాసిన వెంటనే ప్రాథమిక కీ ఆధారంగా కంప్యూటర్ స్క్రీన్‌పైనే మార్కులు కనిపించేలా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.



ఈ ఏడాది ఇంజినీరింగ్ విభాగంలో 1,97,241 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 84,954 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఎం. రుషి (ఉప్పల్) ఫస్ట్ ర్యాంక్ (156.64/160) సాధించగా.. అన్షుల్ (మూసాపేట) రెండో ర్యాంక్ (148.70), ఎం. వంశీధర్‌రెడ్డి (పులివెందుల) మూడో ర్యాంక్ (147.05), జె. రోషన్ మణిదీప్‌రెడ్డి (గుంటూరు) నాలుగో ర్యాంక్ (144.44), ఎ. సాయినిఖిత్ (మహబూబ్‌నగర్) ఐదో ర్యాంక్ (143.30) సాధించారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయండి: కేటీఆర్



హైదరాబాద్: కేంద్రమంత్రి బండి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (KTR)డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఎల్బీనగర్ నియోజకవర్గంలో 'నా బూత్ నా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ బీఎల్ఏలకు ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. ''ఒక బాలికకు అన్యాయం జరిగితే ప్రభుత్వం మిన్నకుండిపోయింది. కాంగ్రెస్, భాజపా కలిసి బాలికకు అన్యాయం చేయాలని చూశాయి. కానీ, ఆమెకు న్యాయం జరగాలని నిలబడి పోరాడింది బీఆర్ఎస్ పార్టీయే. బీఆర్ఎస్, అనుబంధ సంఘాల పోరాటం వల్లే బాలికకు కొంత న్యాయం జరిగే పరిస్థితి వచ్చింది. రెండున్నరేళ్లుగా రాష్ట్రంలో పరిస్థితులు మారిపోయాయి. ప్రధానమంత్రి మోదీ 'బేటీ పడావో.. బేటీ బచావో' అంటున్నారు. కేవలం నినాదాలకే పరిమితమైతే న్యాయం జరగదు. కేంద్రమంత్రి కుమారుడిపై లుక్‌ఔట్ నోటీసు ఇచ్చే పరిస్థితి వచ్చింది. బండి సంజయ్‌ను మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయకపోతే విచారణ సరిగా జరగదు. తప్పు చేసిన వ్యక్తిని 9 రోజులు దాచిపెట్టింది, బాధితురాలి తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేసింది కేంద్రమంత్రే. ఇలాంటి వ్యక్తులు పదవుల్లో కొనసాగడం తెలంగాణకే కాదు.. భారత దేశానికే అవమానకరం'' అని కేటీఆర్ అన్నారు.


## యువతి గొంతుకోసి చంపిన ప్రేమోన్మాది.. స్థానికుల దాడిలో హతం!

- ప్రేమను నిరాకరించిందని జడ్చర్లలో యువతిని దారుణంగా హత్య చేసిన యువకుడు
- నిందితుడిని పట్టుకుని తీవ్రంగా కొట్టిన స్థానికులు, బంధువులు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నిందితుడూ మృతి
- యువతికి వేరే వ్యక్తితో నిశ్చితార్థం కావడమే కారణమని ఆరోపణలు





మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో యువతి గొంతుకోసి చంపిన ప్రేమోన్మాది ప్రజల దాడిలో హతమయ్యాడు. ప్రేమను నిరాకరించిందన్న కక్షతో ఓ యువతిని దారుణంగా హత్య చేసిన యువకుడు, ఆ తర్వాత స్థానికుల దాడిలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ నేడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... జడ్చర్లలోని నిమ్మబావిగడ్డకు చెందిన వైష్ణవి (24) పోలేపల్లి సెజ్‌లోని ఓ పాఠశాలలో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తోంది. శనివారం సాయంత్రం విధులను ముగించుకుని ఇంటికి వెళుతుండగా, అదే ప్రాంతానికి చెందిన తేజ ఆమెను అడ్డగించాడు. తనను ప్రేమించాలని కొంతకాలంగా వేధిస్తున్న తేజ, వెంట తెచ్చుకున్న కత్తితో వైష్ణవిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. గొంతు, కడుపు భాగాల్లో పొడవడంతో ఆమె తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందింది. ఈ దారుణాన్ని కళ్లారా చూసిన వైష్ణవి కుటుంబ సభ్యులు, స్థానికులు ఆగ్రహంతో ఊగిపోయారు. తేజను పట్టుకుని కాళ్లు, చేతులు కట్టేసి తీవ్రంగా కొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, తీవ్ర గాయాలతో ఉన్న తేజను మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున అతడు మృతి చెందాడు. గత రెండేళ్లుగా తేజ తమ కుమార్తెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని, ఆమె నిరాకరించడంతోనే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని వైష్ణవి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇటీవల వైష్ణవికి వేరొకరితో నిశ్చితార్థం జరగడం కూడా తేజ కక్ష పెంచుకోవడానికి కారణమైందని చెబుతున్నారు. మరోవైపు, చనిపోయే ముందు తేజ... "వైష్ణవి నన్ను వాడుకుని డబ్బులు తీసుకుని మోసం చేసింది, అందుకే హత్య చేశాను" అని చెప్పినట్లుగా సమాచారం. ఈ ప్రేమ వ్యవహారం ఇద్దరి ప్రాణాలను బలి తీసుకోవడంతో జడ్చర్లలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం

దామరచర్ల: నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పవర్ ప్లాంట్‌లోని యూనిట్ 3లో భారీగా మంటలు ఎగసిపడుతున్నాయి. పరిసర ప్రాంతాల్లో దట్టంగా పొగ అలముకుంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలార్పేందుకు ప్రయత్నిస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్టు సమాచారం.

## ఇక నాలుగు కేటగిరీలుగా తెలంగాణ ఉద్యమకారులు

- తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు నాలుగు కేటగిరీలు
- కేశవరావు నేతృత్వంలో తొలిసారిగా సమావేశమైన ఉన్నతస్థాయి కమిటీ
- ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారికి తొలి ప్రాధాన్యం
- రాజకీయాలకు అతీతంగా, పక్షపాతం లేకుండా గుర్తింపు ప్రక్రియ
- జిల్లాల పర్యటనలు, అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయం



తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు నేతృత్వంలోని ఈ కమిటీ ఆదివారం తొలిసారి సమావేశమై, అసలైన ఉద్యమకారులను నాలుగు కేటగిరీల కింద గుర్తించాలని తీర్మానించింది. ఈ ప్రక్రియను రాజకీయాలకు అతీతంగా, అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని కమిటీ స్పష్టం చేసింది. సమావేశం అనంతరం కమిటీ తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. దీని ప్రకారం, తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఉద్యమ సమయంలో గాయపడిన వారిని రెండో కేటగిరీలో, అరెస్టులు, జైలు జీవితం, కేసులు ఎదుర్కొన్న వారిని మూడో కేటగిరీలో చేర్చనున్నారు. ఇక క్షేత్రస్థాయిలో ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న వారిని నాలుగో కేటగిరీ కింద గుర్తించనున్నారు. వీరిని గుర్తించేందుకు అప్పటి వార్తాపత్రికల క్లిప్పింగులను ఆధారంగా తీసుకోనున్నారు. గత ప్రభుత్వం కొద్దిమందికి మాత్రమే లబ్ధి చేకూర్చిందని, తమ ప్రక్రియ అలా ఉండదని కమిటీ తేల్చిచెప్పింది. ఉద్యమకారుల గుర్తింపునకు కఠినమైన ప్రమాణాలను రూపొందిస్తామని, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ గౌరవం అందించేందుకు సమగ్ర డేటాబేస్ సిద్ధం చేస్తామని పేర్కొంది. 1969, 1972, 1996 నాటి ఉద్యమకారులతో పాటు వివిధ ఉద్యోగ, కుల, న్యాయవాద, కళాకారుల జేఏసీల నుంచి కూడా సూచనలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. అమరవీరుల జ్యోతి ప్రాంగణంలో కమిటీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని, అలాగే అభిప్రాయ సేకరణ కోసం జిల్లాల పర్యటనలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మొయినాబాద్ జంట హత్యల కేసు.. నిందితురాలు ఆత్మహత్యాయత్నం




హైదరాబాద్: మొయినాబాద్ జంట హత్యల కేసులో ప్రధాన నిందితురాలు కరీమాబేగం ఆత్మహత్యాయత్నం ఘటన కలకలం రేపింది. ఆబేదాబేగం, మహబూబాబీ.. తాండూరు పట్టణం ఇందిరమ్మ కాలనీలో ఉండే దంపతులు కరీమాబేగం, రెహమాన్, వీరి బంధువు నయీంకు వేర్వేరుగా కొంత డబ్బు అప్పుగా ఇచ్చారు. చాలారోజులు అవడంతో డబ్బులు తిరిగివ్వాలని వారిపై మహిళలిద్దరూ ఒత్తిడి తెచ్చారు. దీంతో వారిని చంపేయాలని కరీమాబేగం, రెహమాన్, నయీం పథకం వేశారు. డబ్బు ఇస్తామని నమ్మించి ముందుగా మహబూబాబీని మొయినాబాద్ సమీపంలోని తోల్కట్ట ఫాంహౌస్ వద్దకు తీసుకెళ్లి గొంతు నులిమి హత్య చేసి, అక్కడే గొయ్యి తీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. ఆ తరువాత ఆబేదాబేగంను కూడా అక్కడికే తీసుకెళ్లి అదేరీతిలో హత్య చేసి పాతిపెట్టారు. ఈ కేసులో కరీమాబేగంను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆదివారం కరణ్‌కోట్ పీఎస్‌లో విచారిస్తుండగా.. బాత్రూమ్‌కు వెళ్లిన ఆమె ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించారు. హుటాహుటిన ఆమెను చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

## 'ఐక్య' సంస్థ ప్రారంభం వెనుక ఉద్దేశం ఇదే: మంచు మనోజ్, మౌనిక

- 'ఐక్య ధైర్య సేన సమితి'ని ప్రారంభించిన మంచు మనోజ్, మౌనిక
- సేవా భావం ఉన్నవారందరినీ ఒకే వేదికపైకి తేవడమే లక్ష్యమన్న మనోజ్
- మహిళా సాధికారత, ఉపాధి కల్పనపై కూడా దృష్టి సారిస్తామన్న మౌనిక
- ఐదుగురు పిల్లల విద్యా బాధ్యతలను స్వీకరించిన మనోజ్ దంపతులు
- కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నవీన్ యాదవ్



సమాజానికి సేవ చేయాలనే బలమైన ఆలోచన ఉన్న ప్రతీ ఒక్కరినీ ఒకే గొడుగు కిందకు తేవాలనే గొప్ప లక్ష్యంతోనే ఐక్య సంస్థను ప్రారంభించినట్టు నటుడు 'రా కింగ్' మంచు మనోజ్, ఆయన భార్య మౌనిక భూమా వెల్లడించారు. తన పుట్టినరోజు నేపథ్యంలో, హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో "ఐక్య ధైర్య సేన సమితి" అనే తమ సామాజిక సేవా సంస్థను మనోజ్ అధికారికంగా ఆవిష్కరించారు. సేవా భావం ఉన్నవారందరికీ ఒక వేదికను అందించాలనేదే తమ ముఖ్య ఉద్దేశమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం గురించి మనోజ్ భావోద్వేగంగా మాట్లాడుతూ, "సమాజానికి అండగా నిలబడటం నేను, నా భార్య మౌనిక మా పెద్దల నుంచి నేర్చుకున్నాం. ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినా, ఒకే ఆలోచన ఉన్న వారందరి కోసం ఒక వేదిక ఉండాలనిపించింది. ఈ ఆలోచన నిజానికి నా భార్య మౌనికది. ఆమె స్ఫూర్తితోనే ఈ సంస్థను ప్రారంభిస్తున్నాం. దీని ద్వారా ఎవరికి నిజమైన సహాయం అందినా అదే మాకు గొప్ప విజయం" అని తెలిపారు. ఈ రోజు నుంచే ఐదుగురు పిల్లల విద్యా బాధ్యతలను స్వీకరిస్తున్నామని, ఈ సేవలను రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతీ గ్రామానికి విస్తరిస్తామని ఆయన ప్రకటించారు. అనంతరం మౌనిక భూమా మంచు మాట్లాడుతూ, "మంచి ఉద్దేశంతో నేను, మనోజ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. ఇది మా తల్లిదండ్రుల ఆశీర్వాదాల వల్లే సాధ్యమైంది. ఈ ట్రస్ట్ ద్వారా రక్తదానంతో పాటు మహిళా సాధికారత, ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి పెడతాం. 'నమస్తే వరల్డ్' సంస్థ ద్వారా టాయ్ మేకింగ్ వంటి కోర్సులతో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం" అని వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, "ఐక్య ధైర్య సేన సమితి" పేరును అధికారికంగా ప్రకటించారు. మనోజ్ కుటుంబంతో తమకు మూడు దశాబ్దాల అనుబంధం ఉందని, చిన్నప్పటి నుంచే మనోజ్‌లో సేవా భావం ఉందని కొనియాడారు. మౌనిక ఆలోచనతో పుట్టినరోజున ఈ ట్రస్ట్ ప్రారంభించడం అభినందనీయమని, ఈ కార్యక్రమాలకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఒకవైపు 'డేవిడ్ రెడ్డి' వంటి భారీ చిత్రాలతో నటుడిగా బిజీగా ఉంటూనే, మరోవైపు 'ఐక్య ధైర్య సేన సమితి' ద్వారా సమాజ సేవకు అంకితం కావడం పట్ల మనోజ్ దంపతులపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సినిమాలు, సమాజ సేవ అనే రెండు మార్గాల్లో మనోజ్ తన ప్రయాణాన్ని బలంగా ముందుకు తీసుకెళ్తున్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు ప్రతి పైసా కేంద్రానిదే: కిషన్‌రెడ్డి



హైదరాబాద్: ధాన్యం కొనుగోళ్లకు ప్రతి పైసా కేంద్రమే ఇస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్రం డబ్బులిస్తున్నా.. రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం ఎందుకు కొనడం లేదని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ''ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చడం లేదు. సన్నవడ్లకు బోనస్ ఇవ్వడం లేదు. ధాన్యం కొనుగోళ్ల కోసం రైతులు ధర్నాలు చేస్తున్నారు. ప్రభుత్వమే వారికి సమాధానం చెప్పాలి. మంత్రులు జిల్లాలకు వెళ్లి, ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించాలి'' అని కిషన్‌రెడ్డి మీడియా సమావేశంలో అన్నారు.

# వాహనదారులకు షాక్..

మళ్లీ పెరిగిన సీఎన్‌జీ ధరలు

కేజీ సీఎన్‌జీపై రూ.1 పెంపు

రెండు రోజుల్లో రెండోసారి పెరిగిన ధరలు

మొత్తంగా రూ.3 అదనపు భారం

ఢిల్లీలో కేజీ ధర రూ.80.09



**న్యూఢిల్లీ:** వాహనదారులపై ఇంధన భారం మరింత పెరిగింది. సీఎన్‌జీ ధరలను కేంద్రం మరోసారి పెంచింది. కేజీకి ఒక రూపాయి చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకుంది. రెండు రోజుల వ్యవధిలో సీఎన్‌జీ ధరలు రెండోసారి పెరిగాయి. శుక్రవారం కూడా కేజీ గ్యాస్‌పై రూ.2 చొప్పున పెంచారు. దీంతో మూడు రోజుల వ్యవధిలో సీఎన్‌జీ వాహనదారులపై రూ.3 అదనపు భారం పడినట్లయింది.

తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో సీఎన్‌జీ ధర కేజీ రూ.80.09కి చేరింది. నోయిడా-గాజియాబాద్ ప్రాంతంలో ఈ రేటు రూ.88.70గా నమోదైంది. ముంబయిలో రూ.84.09కి, హైదరాబాద్‌లో రూ.100కు చేరింది. పశ్చిమాసియా యుద్ధం, హర్మూజ్ జలసంధిలో ఆంక్షల నేపథ్యంలో గ్యాస్, చమురు ట్యాంకర్లు నిలిచిపోయిన విషయం తెలిసిందే. దీంతో అంతర్జాతీయ ఉత్పత్తి, సరఫరా దెబ్బతిన్నాయి. దీంతో ఇంధన కొరత ఏర్పడింది. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరిగాయి. ఫలితంగా దేశీయంగానూ ధరల పెంపు అనివార్యమైంది.

## అప్పుడు మ్యాగీ.. ఇప్పుడు కిట్‌క్యాట్..

# నెస్లేకు మనదే పెద్ద మార్కెట్




**న్యూఢిల్లీ:** నెస్లేకు చెందిన చాక్లెట్ కోటెడ్ వేఫర్ బార్ కిట్‌క్యాట్‌కు భారత్ అతిపెద్ద మార్కెట్‌గా అవతరించింది. గడిచిన రెండు మూడేళ్లుగా రెండో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్.. తాజాగా మొదటి స్థానానికి చేరింది. అంటే 85 దేశాల్లో ఈ చాక్లెట్ అమ్ముడవుతుండగా.. అత్యధికంగా విక్రయమయ్యేది మాత్రం మన దేశంలోనే అన్నమాట. వినియోగదారుల నుంచి డిమాండ్, చాక్లెట్‌లో కొత్త ఆవిష్కరణలు, మార్కెటింగ్‌పై పెద్దమొత్తంలో ఖర్చు చేయడం వంటివి ఇందుకు దోహదం చేశాయని నెస్లే తెలిపింది.

గడిచిన కొన్నేళ్లుగా నెస్లే కిట్‌క్యాట్‌కు దేశీయంగా మార్కెట్ వాటా క్రమంగా పెరుగుతూ వస్తోందని నెస్లే ఇండియా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మనీశ్ తివారీ అన్నారు. నెస్లే విక్రయించే మ్యాగీకి ఇప్పటికే భారత్ అతిపెద్ద మార్కెట్ కాగా.. ఇప్పుడు కిట్‌క్యాట్ కూడా ఆ జాబితాలో చేరింది. దశాబ్దం క్రితం కిట్‌క్యాట్ మార్కెట్ పరంగా భారత్ పదో స్థానంలో ఉండేది. నెస్లేకు వచ్చే ఆదాయంలో కిట్‌క్యాట్ నుంచి పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతోంది. అటు విలువ పరంగా, సంఖ్యా పరంగా రెండంకెల వృద్ధి నమోదు చేస్తోందని తివారీ పేర్కొన్నారు. భారత్ తర్వాత జపాన్, బ్రెజిల్, యూరప్ కిట్‌క్యాట్‌కు అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నాయని కంపెనీ తెలిపింది.

కిట్‌క్యాట్ సెలబ్రేక్, కిట్‌క్యాట్ పాప్స్ వంటి ప్యాక్స్‌తో గిఫ్టింగ్ సెగ్మెంట్‌లోకి అడుగుపెట్టామని నెస్లే ఇండియా డైరెక్టర్ జగదీశన్ గోపీ చందర్ ఈ సందర్భంగా తెలిపారు. కిట్‌క్యాట్ డిలైట్స్ పేరుతో ప్రీమియం సెగ్మెంట్‌లోకీ ఎంట్రీ ఇవ్వడం కలిసొచ్చిందని తెలిపారు. ప్రకటన వ్యయం పెంచడం, డిస్‌ప్లే వినియోగించే కమర్షియల్ గ్లాస్ డోర్ రిఫ్రిజిరేటర్ల ప్రోగ్రామ్ కూడా కిట్‌క్యాట్ వృద్ధికి దోహదం చేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు ఏటా మ్యాగీ 5 బిలియన్ సర్వ్‌లు విక్రయమవుతున్నట్లు కంపెనీ తెలిపింది. 1930లో కిట్‌క్యాట్‌ను బ్రిటిషన్ కంపెనీ రౌన్‌ట్రీ స్థాపించగా.. 1988లో నెస్లే దాన్ని కొనుగోలు చేసింది.

## ఆరేళ్ల తర్వాత లాభాల్లోకి వొడాఫోన్ ఐడియా





**న్యూఢిల్లీ:** అప్పుల్లో ఉన్న వొడాఫోన్ ఐడియా ఆరేళ్లలోనే తొలిసారిగా లాభాన్ని నమోదు చేసింది. 2025-26 మార్చి త్రైమాసికంలో రూ.51,970 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. ముఖ్యంగా సర్దుబాటు చేసిన స్థూల ఆదాయాల(ఏజీఆర్) బకాయిల విషయంలో ప్రభుత్వం ఊరటనివ్వడంతో ఇది సాధ్యమైంది. ఏడాది కిందట ఇదే మూడు నెలల కాలంలో కంపెనీకి రూ.7,176 కోట్ల నికర నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. 'డిసెంబరు 31, 2025 నాటికి ఉన్న రూ.80,502 కోట్ల బకాయి కాస్తా, రూ.24,880 కోట్లుగా సవరణకు గురికావడంతో రూ.55,622 కోట్ల(తిరిగి మదింపు చేసిన మొత్తం ప్రభావం కలిపి) అంతరానికి తోడు, ఇతర సంబంధిత కేటాయింపుల ప్రభావం లాభనష్ట ఖాతాలో కనిపించింద'ని కంపెనీ ఎక్స్ఛేంజీలకిచ్చిన సమాచారంలో తెలిపింది. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం 3% పెరిగి రూ.11,229 కోట్ల నుంచి రూ.11,332 కోట్లకు చేరుకుంది.

పూర్తి ఏడాదిలోనూ లాభాలే: ఏజీఆర్ బకాయిల తగ్గింపుతో మార్చి త్రైమాసికానికే కాదు, పూర్తి ఏడాదికి సైతం లాభాల్లో ఉన్న కంపెనీగా వొడాఫోన్ ఐడియా మారింది. 2025-26కు రూ.34,552 కోట్ల వార్షిక లాభాన్ని కంపెనీ ప్రకటించింది. అంతక్రితం ఏడాది రూ.27,384 కోట్ల నష్టం ఉంది. ఇక ఆదాయం సైతం 3% వృద్ధి చెంది రూ.43,454 కోట్ల నుంచి రూ.44,782 కోట్లకు పెరిగింది.

# రాజస్థాన్‌కు షాకిచ్చిన ఢిల్లీ..

### ప్లే ఆఫ్స్ ఆశలు సజీవం..!

**న్యూఢిల్లీ:** ప్లే ఆఫ్స్ రేసుకు ఆమడ దూరంలో నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ ఐదో స్థానంలోని రాజస్థాన్ రాయల్స్‌కు షాకిచ్చింది. భారీ ఛేదనలో ఓపెనర్లు కేఎల్ రాహుల్(56), పొరెల్(51).. శతక భాగస్వామ్యంతో గెలుపు పునాది వేశారు. కానీ టపటపా మూడు వికెట్లు పడడంతో రాజస్థాన్ పోటీలోకి వచ్చింది. కానీ అక్షర్ పటేల్ (34 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు ఇంప్యాక్ట్ సబ్ అశుతోష్(18 నాటౌట్) మెరుపులు తోడవ్వగా ఢిల్లీ 5 వికెట్లతో గెలుపొంది ఆశలు సజీవంగా ఉంచుకుంది.



పంతొమ్మిదో సీజన్ ప్లే ఆఫ్స్ రేసులోని జట్లకు వరసగా షాక్‌లు తగులుతున్నాయి. చావోరేవో పోరులో రాజస్థాన్‌ను 193కే నిలువరించిన ఢిల్లీకి ఓపెనర్లు కేఎల్ రాహుల్(56), అభిషేక్ పొరెల్(51) అదిరే ఆరంభమిచ్చారు. పట్టుదలగా ఆడిన ఈ ఇద్దరూ రాజస్థాన్ బౌలర్లకు అవకాశమివ్వకుండా బౌండరీలతో లక్ష్యాన్ని కరిగించారు. పవర్ ప్లేలో కొట్టిన ఈ ద్వయం శతక భాగస్వామ్యంతో ఢిల్లీని గెలుపు దిశగా నడిపింది. పదో ఓవర్ తర్వాత పొరెల్ ఔటైనా.. సహిల్ పరాఖ్(9) తోడుగా రాహుల్ ఇన్నింగ్స్ నిర్మించాడు. పరాఖ్‌ను ఔట్ చేసి ఈ జోడీని విడదీశాడు ఆర్చర్.

క్రీజునంటుకున్న రాహుల్‌ను శనక బౌల్డ్ చేయడంతో రాజస్థాన్ ఆశలు చిగురించాయి. ఢిల్లీకి మరో ఝలికిస్తూ స్టబ్స్(4)ను వెనక్కి పంపాడు ఆర్చర్. డేంజరస్ మిల్లర్(9)ను బ్రిజేశ్ ఔట్ చేయగా.. అక్షర్ పటేల్(34 నాటౌట్) సిక్సర్ కొట్టగా చివరి ఓవర్లో 7 రన్స్ ఢిల్లీకి అవసరం కాగా.. ఉత్కంఠ నెలకొంది. ఇంప్యాక్ట్ సబ్ అశుతోష్ (18 నాటౌట్) తొలి బంతికే బౌండరీ, సిక్సర్‌తో ఢిల్లీకి 5 వికెట్ల విజయాన్ని, కీలకమైన రెండు పాయింట్లను కట్టబెట్టాడు.

### జురెల్, వైభవ్ మెరుపులు

గెలవక తప్పని మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ భారీ స్కోర్ అవకాశాన్ని చేజార్చుకుంది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(46) మెరుపు ఆరంభాన్నిచ్చాడు. యశస్వీ(12) త్వరగానే ఔటైనా.. ధ్రువ్ జురెల్(53) జతగా చెలరేగిన వైభవ్.. మిచెల్ స్టార్క్(4-40), ఎంగిడి(2-24) వంటి సీనియర్ పేసర్లకు షాకిస్తూ సిక్సర్లతో అలరించాడు. అతడి విధ్వంసంతో పవర్ ప్లేలోనే రాజస్థాన్ వికెట్ నష్టానికి 75 రన్స్ చేసింది. హాఫ్ సెంచరీ ముందు వైభవ్ ఔటైనా.. జురెల్, రియాన్ పరాగ్(51) దూకుడుగా ఆడి స్కోర్ బోర్డును ఉరికించారు. కానీ, స్టార్క్ మిడిల్ ఓవర్లలో దెబ్బకొట్టాడు. 15వ ఓవర్లో వరస బంతుల్లో పరాగ్, ఫెరీరా(0)ను.. ఐదో బంతికి రవి సింగ్(4)ను పెవిలియన్ చేర్చడంతో రాజస్థాన్ స్కోర్ వేగం తగ్గింది. డెత్ ఓవర్లలో ఎంగిడి, స్టార్క్‌లు పొదుపుగా బౌలింగ్ చేయడంతో రాజస్థాన్ బ్యాటర్లకు దంచేసే అవకాశమే రాలేదు. ఫలితంగా చివరి 36 బంతుల్లో 6 వికెట్లు కోల్పోయి కేవలం 33 పరుగులే చేసింది.

## టీ20 క్రికెట్‌లో సాయి సుదర్శన్

# ప్రపంచ రికార్డు..

గేల్, కాన్వే వెనక్కి!

టీ20ల్లో అత్యంత వేగంగా 3000 పరుగులు చేసిన ఆటగాడిగా సాయి సుదర్శన్

కేవలం 78 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఘనత సాధించి షాన్ మార్ష్ రికార్డు బ్రేక్

గుజరాత్ తరఫున వరుసగా నాలుగు అర్ధశతకాలు చేసిన తొలి క్రికెటర్

ఐపీఎల్ 2026లో 554 పరుగులతో ఆరెంజ్ క్యాప్ హోల్డర్‌గా సాయి



**కోల్‌కతా:** యువ సంచలనం, గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ సాయి సుదర్శన్ తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ సరికొత్త చరిత్ర సృష్టించాడు. శనివారం కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అద్భుత అర్ధశతకంతో మెరిసిన అతడు టీ20 ఫార్మాట్‌లో అత్యంత వేగంగా 3000 పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలో షాన్ మార్ష్, క్రిస్ గేల్ వంటి దిగ్గజాలను వెనక్కి నెట్టాడు.

ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో సాయి సుదర్శన్ కేవలం 78 ఇన్నింగ్స్‌ల్లోనే 3000 పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. ఇప్పటివరకు ఈ రికార్డు ఆస్ట్రేలియా బ్యాటర్ షాన్ మార్ష్ పేరిట ఉండేది. మార్ష్ 85 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనత సాధించాడు. సాయి సుదర్శన్.. డెవాన్ కాన్వే (86), డార్సీ షార్ట్ (86), యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ (87) కంటే వేగంగా ఈ మైలురాయిని అందుకోవడం విశేషం.

ఇదే మ్యాచ్‌లో సాయి సుదర్శన్ మరో అరుదైన ఘనతను కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. కేకేఆర్‌పై 28 బంతుల్లో 53 పరుగులతో అజేయంగా నిలిచిన అతను, గుజరాత్ టైటాన్స్ తరఫున వరుసగా నాలుగో అర్ధశతకం నమోదు చేశాడు. ఫ్రాంచైజీ చరిత్రలో ఇప్పటివరకు ఏ ఆటగాడు ఈ ఘనత సాధించలేదు.

## ఐపీఎల్‌లో మహమ్మద్ సిరాజ్ అరుదైన ఘనత

టీ20 క్రికెట్‌లో 200 వికెట్ల మైలురాయిని అందుకున్న సిరాజ్

కేకేఆర్‌తో మ్యాచ్‌లో రహానెను ఔట్ చేసి రికార్డ్

ఈ ఘనత సాధించిన 21వ భారత బౌలర్‌గా హైదరాబాదీ పేసర్



**న్యూఢిల్లీ:** గుజరాత్ టైటాన్స్ స్టార్ పేసర్, హైదరాబాదీ ఆటగాడు మహమ్మద్ సిరాజ్ తన కెరీర్‌లో ఓ అరుదైన మైలురాయిని అందుకున్నాడు. శనివారం కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో జరిగిన మ్యాచ్‌లో టీ20 ఫార్మాట్‌లో 200 వికెట్లను పూర్తి చేసుకున్నాడు. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఈ ఘనత సాధించాడు.

కేకేఆర్ ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో కెప్టెన్ అజింక్యా రహానెను ఔట్ చేయడం ద్వారా సిరాజ్ ఈ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. సిరాజ్ విసిరిన అద్భుతమైన ఇన్‌స్వింగర్‌కు రహానె (14) డిఫెన్స్ ఛేదించుకుని బంతి వికెట్లను గిరాటేసింది. ఈ వికెట్‌తో టీ20ల్లో 200 వికెట్లు పడగొట్టిన 21వ భారత బౌలర్‌గా సిరాజ్ నిలిచాడు. తన 174వ టీ20 మ్యాచ్‌లో ఈ మైలురాయిని చేరుకున్న సిరాజ్ ఐపీఎల్‌లో ఇప్పటివరకు 121 మ్యాచ్‌లలో 123 వికెట్లు పడగొట్టాడు.

అయితే, సిరాజ్ వ్యక్తిగత రికార్డు సాధించిన ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ బౌలర్లు మాత్రం పూర్తిగా తేలిపోయారు. తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 247 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ ఫిన్ అలెన్ (93) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. కేవలం 35 బంతుల్లో 4 ఫోర్లు, 10 సిక్సర్లతో గుజరాత్ బౌలింగ్‌ను తుత్తునియలు చేశాడు. అతడికి అండగా అంగ్‌క్రిష్ రఘువంశీ (82 నాటౌట్), కామెరాన్ గ్రీన్ (52 నాటౌట్) మెరుపు అర్ధశతకాలతో రాణించారు.

గుజరాత్ ఫీల్డర్లు రెండుసార్లు క్యాచ్‌లు వదిలిపెట్టడంతో అలెన్ మరింత రెచ్చిపోయాడు. రహానె ఔటయ్యాక, అలెన్-రఘువంశీ రెండో వికెట్‌కు 95 పరుగులు జోడించగా, ఆ తర్వాత రఘువంశీ-గ్రీన్ అజేయంగా మూడో వికెట్‌కు 108 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి కేకేఆర్‌కు భారీ స్కోరును అందించారు.

# ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌లోకి దూసుకెళ్లిన ఆర్‌సీబీ..

పంజాబ్‌పై ఘన విజయం

పంజాబ్ కింగ్స్‌పై 23 పరుగుల తేడాతో గెలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు

ఈ విజయంతో ఐపీఎల్ 2026 ప్లే ఆఫ్స్‌కు చేరిన తొలి జట్టుగా ఆర్‌సీబీ ఘనత

అర్ధ సెంచరీలతో రాణించిన వెంకటేశ్ అయ్యర్, విరాట్ కోహ్లీ

పంజాబ్ తరఫున శశాంక్ సింగ్ మెరుపు హాఫ్ సెంచరీ చేసినా ఫలితం శూన్యం

బెంగళూరు విజయంలో కీలకపాత్ర పోషించిన రసిఖ్ సలామ్ దార్



**ధర్మశాల:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తూ ప్లే ఆఫ్స్‌లోకి అడుగుపెట్టింది. ఆదివారం ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఆర్‌సీబీ 23 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో, ఈ సీజన్‌లో ప్లే ఆఫ్స్ బెర్తును ఖాయం చేసుకున్న తొలి జట్టుగా ఆర్‌సీబీ నిలిచింది. తొలుత బ్యాటింగ్‌లో వెంకటేశ్ అయ్యర్, విరాట్ కోహ్లీ అర్ధ సెంచరీలతో చెలరేగగా, అనంతరం బౌలర్లు రాణించడంతో బెంగళూరు ఖాతాలో మరో గెలుపు చేరింది. శశాంక్ సింగ్ వీరోచిత పోరాటం చేసినా పంజాబ్‌కు ఓటమి తప్పలేదు.

223 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. భువనేశ్వర్ కుమార్ ధాటికి ప్రియాన్ష్ ఆర్య (0), ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (2) పెవిలియన్ చేరారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (1) కూడా విఫలమవడంతో పంజాబ్ 19 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో కూపర్ కనోలీ (37), సూర్యాంశ్ షెడ్గే (35), మార్కస్ స్టొయినిస్ (37) ఫర్వాలేదనిపించారు.

అయితే, అసలు సంచలనం శశాంక్ సింగ్ రూపంలో వచ్చింది. కేవలం 27 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 56 పరుగులు చేసిన శశాంక్, ఒకానొక దశలో పంజాబ్‌కు విజయంపై ఆశలు రేపాడు. కానీ, కీలక సమయంలో రసిఖ్ సలామ్ దార్ అతన్ని ఔట్ చేయడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. చివరికి పంజాబ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 199 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. ఆర్‌సీబీ బౌలర్లలో రసిఖ్ సలామ్ దార్ 3 వికెట్లతో చెలరేగగా, భువనేశ్వర్ కుమార్ రెండు వికెట్లు పడగొట్టాడు.


అంతకుముందు, టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ ఫీల్డింగ్ ఎంచుకోగా, ఆర్‌సీబీ బ్యాటింగ్‌కు దిగింది. ఆరంభంలోనే జాకబ్ బెథెల్ (11) వికెట్ కోల్పోయినా, కెప్టెన్ విరాట్ కోహ్లీ (37 బంతుల్లో 58; 4 ఫోర్లు, 3 సిక్సులు), దేవదత్ పడిక్కల్ (25 బంతుల్లో 45; 4 ఫోర్లు, 3 సిక్సులు) అద్భుతమైన భాగస్వామ్యంతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. వెంకటేశ్ అయ్యర్ అసలు సిసలు విధ్వంసం సృష్టించాడు. కేవలం 40 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో అజేయంగా 73 పరుగులు చేశాడు. చివర్లో టిమ్ డేవిడ్ (12 బంతుల్లో 28) కూడా మెరుపులు మెరిపించడంతో ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగుల భారీ స్కోరు సాధించింది.

MOVIE TIME

## 'పెద్ది' ట్రైలర్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం..

### స్పెషల్ అప్‌డేట్ ఇచ్చిన రామ్ చరణ్

**టాకీస్:** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం పెద్దిపై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న ఈ స్పోర్ట్స్ డ్రామా చిత్రం ఇప్పటికే ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని సృష్టించింది. విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, పాటలు సినిమాపై భారీ హైప్ తీసుకొచ్చాయి. ఇప్పుడు అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న అంశం పెద్ది ట్రైలర్. ఈ ట్రైలర్ విడుదల కోసం సినీ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న సమయంలో చిత్రబృందం మరో భారీ అప్డేట్ ఇచ్చింది. ఇప్పటికే ముంబైలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు ప్రకటించిన మేకర్స్, తాజాగా ఈ ఈవెంట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించారు.



ఈ సందర్భంగా రామ్ చరణ్ స్వయంగా ఓ ప్రత్యేక గ్లింప్స్ ద్వారా అభిమానుల్లో మరింత ఉత్సాహం నింపారు. "ఇప్పటివరకు మీరు పాటలు, గ్లింప్స్ చూశారు.. ఇక ఇప్పుడు అసలు బ్లాస్ట్ చూడబోతున్నారు" అంటూ అభిమానుల్లో ఆసక్తిని పెంచేలా రామ్ చరణ్ సందేశం ఇచ్చారు. ఈ మాటలతో సోషల్ మీడియాలో పెద్ది ట్రైలర్‌పై చర్చలు మరింత పెరిగిపోయాయి. ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్ వేదికగా ఈ గ్రాండ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరగనుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు సమాచారం. భారీ స్థాయిలో అభిమానులు, సినీ ప్రముఖులు పాల్గొనే అవకాశమున్న ఈ ఈవెంట్‌పై ఇప్పుడు ప్రత్యేక ఆసక్తి నెలకొంది.

స్పోర్ట్స్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో గ్రామీణ నేపథ్యంలో కనిపించిన చరణ్ లుక్ అభిమానులను ఆకట్టుకుంది. ఇక ఈ చిత్రానికి ఆస్కార్ విజేత సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఆయన అందించిన పాటలకు ఇప్పటికే మంచి స్పందన లభించింది. అలాగే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా సినిమాకు ప్రత్యేక బలంగా నిలుస్తుందని చిత్రబృందం భావిస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ నిర్మిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న పెద్ది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ట్రైలర్ విడుదలతో సినిమా అంచనాలు మరింత పెరుగుతాయా? అభిమానులు ఆశిస్తున్న స్థాయిలో ఈ ట్రైలర్ ఉండబోతుందా? అన్న ఆసక్తి ఇప్పుడు అందరిలో కనిపిస్తోంది.

## ఇండస్ట్రీలో నిలబెట్టేది కేవలం ఒకరి టాలెంట్, నటన, పనితీరు మాత్రమే..

### హీరోయిన్ ఆనంది

టాకీస్: సినీ పరిశ్రమలో కెరీర్, వివాహం అనే అంశాలపై ఉన్న సాధారణ అపోహలను హీరోయిన్ ఆనంది తన వ్యక్తిగత జీవితం ద్వారా సవాలు చేశారు. మహానటి వంటి చిత్రాల్లో కూడా నటీమణులు పెళ్లి చేసుకుంటే కెరీర్ దెబ్బతింటుందనే డైలాగులు ఉన్నాయని, అలాంటి అభిప్రాయాలు ఇప్పటికీ చాలామందిలో ఉన్నాయని ఆమె ప్రస్తావించారు. చాలామంది హీరోయిన్లు 35-38 ఏళ్ల తర్వాత వివాహం చేసుకుంటుండగా, కొందరు అసలు పెళ్లి చేసుకోకుండా ఉన్నారని చెప్పారు.

అయితే, ఆనంది మాత్రం కేవలం 23 ఏళ్ల వయసులోనే వివాహం చేసుకుని, కెరీర్‌లో విజయాన్ని కొనసాగించి, పెళ్లి, పిల్లలకు, ప్రతిభకు సంబంధం లేదని నిరూపించారు. ఆమె దృష్టిలో, ఇండస్ట్రీలో నిలబెట్టేది కేవలం ఒకరి టాలెంట్, నటన, పనితీరు మాత్రమే. తన వివాహం గురించి మాట్లాడుతూ, అది తన తల్లిదండ్రులు, తన నిర్ణయం రెండింటి ఫలితమేనని ఆనంది వెల్లడించారు. తన తల్లిదండ్రులు పెళ్లికి సరైన సమయం అని భావించారని, తనకు తన భర్త సరైన భాగస్వామి అనిపించారని ఆమె పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో తనకు అన్నీ మంచే జరిగాయని, ఆ సమయం మైండ్‌సెట్‌లను మార్చిందని ఆమె వివరించారు. ఆనంది ఒక స్టార్ హీరోను వివాహం చేసుకుంటారని చాలామంది భావించగా, ఆమె ఒక మెరైన్ ఇంజనీర్‌ను వివాహం చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు.

తన భర్త పుస్తకాలు ఎక్కువగా చదువుతారని, ఆయన వ్యక్తిత్వం తనకు చాలా ఆసక్తికరంగా అనిపించిందని ఆనంది తెలిపారు. సెట్‌లో ఆయనతో తన పరిచయం మొదలైందని, ఆయన తన డైరెక్టర్ భార్య తమ్ముడని వివరించారు. పనికి గ్యాప్ ఉన్నప్పుడు ఆయన ప్రొడక్షన్, కెమెరా వర్క్ వంటి విషయాల్లో సెట్‌లో సహాయపడేవారని చెప్పారు. అయితే, పుస్తకాలు చదవడం చూసి ప్రేమలో పడలేదని, ఫ్లైట్‌లో ప్రయాణిస్తున్నప్పుడు క్విజ్ గేమ్స్ ఆడుతూ తమ పరిచయం బలపడిందని తెలిపారు ఆనంది.


50 రోజుల పాటు సెట్‌లో ఆయన్ని గమనించిన తర్వాత, తమ తల్లిదండ్రులు కూడా ఇష్టపడటంతో వివాహం కుదిరిందని, ఇది ఒక మెంట్ టు బీ సంబంధమని ఆనంది పేర్కొన్నారు. తమది పెద్ద ప్రేమకథ కాదని, నేరుగా పెళ్లి ప్రపోజల్ వచ్చిందని ఆమె స్పష్టం చేశారు. తాను బిలియనీర్లు లేదా మిలియనీర్లను కోరుకోలేదని, బంగ్లాలు, కార్లు తాను స్వయంగా సంపాదించుకోగలనని ఆనంది అన్నారు.



## వెంకటేశ్ - త్రివిక్రమ్ సినిమాలో స్పెషల్ సర్‌ప్రైజ్..

### పాత హిట్ పాటకు రీమిక్స్ ప్లాన్!

**టాకీస్:** టాలీవుడ్‌లో ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్లలో హీరో వెంకటేష్- దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ కూడా ఒకటి. ఈ ఇద్దరి కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ కథా నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో వినోదంతో పాటు భావోద్వేగాలు, యాక్షన్ అంశాలు కూడా ప్రధాన ఆకర్షణగా ఉ ండనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో ప్రేక్షకులకు ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇవ్వడానికి చిత్రబృందం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వెంకటేశ్ గతంలో నటించిన ఓ హిట్ సినిమాలోని పాపులర్ పాటను కొత్తగా రీమిక్స్ చేసి ఈ సినిమాలో ఉపయోగించే ఆలోచనలో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఏ పాటను ఎంపిక చేశారన్న విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.




సాధారణంగా త్రివిక్రమ్ తన సినిమాల్లో సంగీతం, సంభాషణలు, వినోదం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ముఖ్యంగా పాత క్లాసిక్ అంశాలను కొత్త తరానికి తగ్గట్టుగా అందించడంలో ఆయనకు ప్రత్యేక శైలి ఉంది. దీంతో వెంకటేశ్ పాత సినిమా పాటను కొత్తగా ఎలా చూపిస్తారనే ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. ఇక ఈ సినిమా కేవలం కుటుంబ కథతో మాత్రమే కాకుండా పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంగా రూపొందనున్నట్లు తెలుస్తోంది. యాక్షన్ సన్నివేశాలతో పాటు ప్రేక్షకులను నవ్వించే కామెడీ ట్రాక్ కూడా కీలకంగా ఉండబోతున్నట్లు సమాచారం. ముఖ్యంగా వెంకటేశ్ కామెడీ టైమింగ్‌కు త్రివిక్రమ్ రచన జతకావడంతో మరోసారి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రూపుదిద్దుకోనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

త్రివిక్రమ్ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ప్రీ-ప్రొడక్షన్ నుంచి ప్రతి అంశాన్ని జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం షూటింగ్ పూర్తి చేసి వేసవి సీజన్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. కాగా, వెంకటేశ్ -- త్రివిక్రమ్ అనుబంధం కొత్తది కాదు. గతంలో నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి వంటి చిత్రాలకు త్రివిక్రమ్ రచయితగా పని చేశారు. ఆ సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు చాలా సంవత్సరాల తర్వాత వీరిద్దరూ నేరుగా హీరో -- దర్శకుడిగా కలిసి పనిచేస్తుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.

## దేశాన్ని కుదిపేసిన 'హాథ్రస్' ఘటనపై డాక్యు-సిరీస్..

### ట్రైలర్ విడుదల!

టాకీస్: దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన హాథ్రస్ ఘటన ఆధారంగా రూపొందిన హిందీ డాక్యు-సిరీస్ 'హాథ్రస్' అధికారిక ట్రైలర్ ప్రముఖ ఓటీటీ వేదిక జీ5లో విడుదలైంది. సమాజంలో ఎంతో చర్చకు దారితీసిన ఈ వివాదమైన అంశాన్ని, దాని వెనుక ఉన్న నిజాలను, బాధితురాలికి జరిగిన అన్యాయాన్ని ఈ డాక్యు-సిరీస్ ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించబోతున్నట్లు తెలుస్తుంది. 2020 సెప్టెంబరులో ఉత్తరప్రదేశ్‌లోని హాథ్రస్ జిల్లాలో జరిగిన అత్యంత అమానవీయమైన అత్యాచార ఉదంతం ఆధారంగా ఈ సిరీస్ తెరకెక్కింది. నాటి భయానక పరిస్థితులను, ఆ తర్వాత జరిగిన పరిణామాలను ఈ ట్రైలర్‌లో ఎంతో హృదయవిదారకంగా చూపించారు. వాస్తవ సంఘటనల ఆధారంగా ఎంతో నిజాయితీతో కూడిన పరిశోధనాత్మక శైలిలో రూపొందిన ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం వీక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. యథార్థ గాథలను, ఇన్వెస్టిగేటివ్ కథనాలను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ సిరీస్ ఒక సరికొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ పేర్కొంటున్నారు. ఈ కథనానికి నేపథ్యమైన హాథ్రస్ ఘోరం 2020 సెప్టెంబర్ 14న జరిగింది. హథ్రాస్ జిల్లాలోని ఒక గ్రామంలో 19 ఏళ్ల దళిత యువతిపై నలుగురు దుర్మార్గులు క్రూరంగా అత్యాచారం చేసి, శారీరకంగా తీవ్రంగా హింసించారు. నిందితుల దాడిలో వెన్నెముక విరిగిపోయి, నాలుకకు తీవ్ర గాయాలైన ఆ బాధితురాలు ఢిల్లీలోని ఆసుపత్రిలో ప్రాణాల కోసం పోరాడి



సెప్టెంబర్ 29న కన్నుమూసింది. అయితే ఆ తర్వాత బాధితురాలి మృతదేహాన్ని అర్ధరాత్రి వేళ కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా, వారిని గదిలో బంధించి పోలీసులే బలవంతంగా అంత్యక్రియలు నిర్వహించడం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి, నిరసనలకు దారితీసింది. ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఒత్తిడి రావడంతో ఈ కేసు విచారణను ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. ఆ తర్వాత ప్రత్యేక కోర్టు ఈ కేసులో ప్రధాన నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించగా, మిగిలిన ముగ్గురిని ఆధారాలు లేకపోవడంతో విడుదల చేసింది. భారతదేశంలో మహిళల భద్రత, కుల వివక్ష మరియు పోలీసుల వైఫల్యాలపై తీవ్రమైన చర్చను లేవనెత్తిన ఈ దురదృష్టకర సంఘటనకు సంబంధించిన పూర్తి నిజాలను నిశ్శితంగా విశ్లేషిస్తూ రూపొందించిన ఈ సంచలనాత్మక డాక్యు-సిరీస్ ప్రస్తుతం జీ5 ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.

## హల్దీ వేడుకల్లో మెరిసిపోయిన మెహరీన్..






**టాకీస్:** టాలీవుడ్ ప్రేక్షకులకు తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న హీరోయిన్ మెహరీన్ కౌర్ పిర్జాదా ఇటీవల తన పెళ్లి వార్తతో అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది. గత కొంతకాలంగా తన వ్యక్తిగత జీవితాన్ని గోప్యంగా ఉ ంచిన ఆమె, ఏప్రిల్ నెలలో అర్ష్ ఔలఖ్‌తో తన వివాహం జరిగిన విషయాన్ని సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడించింది. పెళ్లి ఫోటోలను పంచుకుంటూ అభిమానులతో ఈ ఆనంద క్షణాలను షేర్ చేసుకుంది. హిమాచల్ ప్రదేశ్‌లో ప్రకృతి అందాల నడుమ వీరి వివాహం అత్యంత సన్నిహితుల సమక్షంలో డెస్టినేషన్ వెడ్డింగ్‌గా జరిగినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే పాల్గొన్న ఈ వేడుకను సంప్రదాయం, ఆధునికత కలగలిపి ప్రత్యేకంగా నిర్వహించినట్లు తెలుస్తోంది. తాజాగా మెహరీన్ తన పెళ్లి వేడుకలకు సంబంధించిన మరో ప్రత్యేక ఘట్టాన్ని అభిమానులతో పంచుకుంది. హల్దీ వేడుకల్లో పాల్గొన్న ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేయగా అవి ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోల్లో మెహరీన్ సంప్రదాయ దుస్తుల్లో ఎంతో అందంగా కనిపిస్తూ ఆకట్టుకుంటోంది. పసుపు రంగు థీమ్‌తో అలంకరించిన వేదిక మధ్య మెహరీన్ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి హల్దీ వేడుకల్లో ఆనందంగా పాల్గొన్నట్లు ఫోటోల్లో కనిపిస్తోంది. నవ్వులు, సరదా క్షణాలు, కుటుంబంతో గడిపిన మధుర అనుభూతులు ఈ చిత్రాల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆమె ముఖంలో కనిపించిన ఆనందం అభిమానులను ఆకర్షిస్తోంది. ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో అభిమానులు, సినీ ప్రముఖులు కొత్త జీవితంలో అడుగుపెట్టిన ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

"చాలా అందంగా ఉన్నారు", "క్యూట్ కపుల్", "హ్యాపీ మ్యారెడ్ లైఫ్" అంటూ కామెంట్లు చేస్తున్నారు.

## '96' దర్శకుడితో ఫహాద్ ఫాజిల్ కొత్త సినిమా..

### అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చేసింది!



టాకీస్: ప్రముఖ మాలీవుడ్ స్టార్ నటుడు ఫహాద్ ఫాజిల్ మరియు విలక్షణ చిత్రాల దర్శకుడు సి. ప్రేమ్ కుమార్ కాంబినేషన్‌లో ఒక సరికొత్త చిత్రం అధికారికంగా ప్రారంభమైంది. తమిళంలో '96', 'మెయ్యళగన్' (తెలుగులో 'సత్యం సుందరం') వంటి హృదయానికి హత్తుకునే క్లాసిక్ చిత్రాలను అందించిన దర్శకుడు ప్రేమ్ కుమార్, ఈసారి ఫహాద్ ఫాజిల్‌తో కలిసి ఒక విభిన్నమైన యాక్షన్ థ్రిల్లర్ కథతో ముందుకు వస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనను చిత్ర బృందం (మేకర్స్) సోషల్ మీడియా వేదికగా ఒక ప్రత్యేక వీడియో ద్వారా వెల్లడించింది. ఈ సినిమాలో ఫహాద్ ఫాజిల్ సోలో హీరోగా నటిస్తున్నారు. ఇప్పటివరకు ఫీల్ గుడ్ మరియు ఎమోషనల్ కథలను తెరకెక్కించిన దర్శకుడు ప్రేమ్ కుమార్, మొదటిసారిగా ఒక థ్రిల్లర్ జోనర్‌ను ఎంచుకోవడం విశేషం. ఈ కథను తాను గత నాలుగేళ్లుగా సిద్ధం చేసుకున్నానని, జోనర్ మారినప్పటికీ తన గత చిత్రాల తరహాలోనే ఇందులోనూ బలమైన భావోద్వేగాలు ఉంటాయని దర్శకుడు పేర్కొన్నారు. ఫహాద్ ఫాజిల్‌కు కేవలం 45 నిమిషాల పాటు కథ వినిపించగా, ఆయన ఎంతో ఎగ్జైట్ అయ్యి వెంటనే ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిపారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో ఫహాద్ ఫాజిల్ సరసన శివద కథానాయికగా నటిస్తుండగా.. చేతన్, హరీష్ ఉత్తమన్, కరుణాకరన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి గోవింద్ వసంత సంగీతం అందిస్తున్నారు. వేల్స్ ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై ఈషారి కే గణేష్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.